ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
3
శనివారం 13 జూలై 2024

పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం.. రూ.కోట్లు కూడబెడుతోంది. కార్డుదారులకు చేరాల్సిన బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోంది. నాణ్యత సరిగా ఉండదని కొందరు.. తినలేక మరికొందరు.. రేషన్ బియ్యాన్ని తీసుకో కుండా కార్డుదారులు ఎండీయూ ఆపరేటర్లు ఇచ్చే నగదు తీసుకుంటున్నారు. ఇదే అవకాశంగా ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు, దళారులు ఇలా రేషన్ మాఫియా బియ్యాన్ని బొక్కేస్తోంది. రేషన్ బియ్యం రీసైక్లింగ్‌తో మళ్లీ మిల్లర్లు ప్రభుత్వానికి అంటగడుతుండగా మరికొందరు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. మరికొందరైతే విదేశాలకు కూడా తరలిస్తూ పెద్దమొత్తంలో సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. వీఆర్వో స్థాయి నుంచి జేసీ వరకు పర్యవేక్షణ లేకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేషన్ మాఫియా రోజురోజుకు రెచ్చిపోతోంది. పెట్టుబడి లేకుండా రూ.కోట్లు వస్తుంది. దీంతో అధికారులను, రాజకీయ నాయకులను రేషన్ మాఫియా డబ్బుతో కొట్టి తమ జోలికి రాకుండా చేసుకుంటోందన్న విమర్శలున్నాయి. మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్ బియ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో అక్రమాలు కోకొల్లలుగా వెలుగు చూస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కూడా పెద్దఎత్తున బియ్యం దందా సాగుతోందనేది బహిరంగ రహస్యం. కూటమి ప్రభుత్వంలో ఈ దందాకు చెక్ పడుతుందా లేదా అని పలువురు ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి రేషన్ బియ్యం దందా ఓ ఛాలెంజ్‌గా మారింది.

రేషన్ బియ్యంతో.. రూ.కోట్లు



కిలో రూ.9కి కొని.. రూ.30కి విక్రయం

- రీసైక్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికే సరఫరా
- మంత్రి నాదెండ్ల తనిఖీల్లో అక్రమాలు బహిర్గతం
- ప్రభుత్వం రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేసేనా ?

నరసరావుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బియ్యం కిలో రూ.9. మార్కెట్‌లో ఈ రేటుకు బియ్యం ఎక్కడ లభిస్తుందని ఆశ్చర్యం వేస్తోందా. మార్కెట్‌లో కాదు ఇది తెల్ల కార్డుదారుడు బియ్యం విక్రయించే ధర. ఒక్కొక్క దళారీ చేతులు మారి తిరిగి ప్రభుత్వం వద్దకే రేషన్ బియ్యం చేరుతోంది. పెద్దఎత్తున రేషన్ బియ్యం రీ సైక్లింగ్ జరుగుతోంది. బ్లాక్ మార్కెట్‌కు భారీగా బియ్యం నిల్వలు తరలిపోతున్నాయి. బియ్యం బ్లాక్ మార్కెట్ పార్టీలతో సంబంధం లేకుండా జరుగుతుంది. రాష్ట్ర సరిహద్దులను దాటించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. కార్డుదారులకు సరఫరా చేస్తున్న బియ్యంతో సగానికి పైగా నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయనేది బహిరంగ రహస్యం. రీ సైక్లింగ్ రూపంలో ప్రభుత్వానికే రూ.30కి బియ్యం కొందరు మిల్లర్లు సరఫరా చేస్తున్నారు. రేషన్ సరఫరా చేస్తున్న వాహన దారులు కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తు న్నారు. వేలి ముద్ర తీసుకుని కిలోకి రూ.9 నుంచి రూ.10 వరకు కార్డుదారులకు ఇస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని కిలో రూ.13 నుంచి రూ.14కు దళారీ లకు విక్రయిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని మిల్లుల్లో నిల్వ చేసి ఒక పట్టు పాలిష్ వేసి బ్లాక్ మార్కెట్‌లో కిలో రూ.23 నుంచి రూ.24కు విక్రయిస్తారు. పెద్దఎత్తున కాకినాడ పోర్టుకు, కొంత మేర తెలంగాణలోని హాలియా ప్రాంతానికి ఎగుమతి చేస్తున్నారు. పోర్టు నుంచి ఇతర దేశాలకు బియ్యం తరలి పోతున్న విషయాన్ని స్వయంగా మంత్రి నాదెండ్ల మనోహర్ తన తనిఖీల ద్వారా నిగ్గు తేల్చిన విషయం తెలిసిందే. హాలియా ప్రాంతానికి తరలిపోతున్న బియ్యానికి పాలిష్ పట్టించి తెలంగాణ ప్రాంతంలో మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు.

మంత్రి జిల్లా అయినా తగ్గేదేలేదు

వైసీపీ ప్రభుత్వం పడిపోయి కూటమి అధికారంలోకి వచ్చినా గుంటూరు జిల్లాలో రేషన్ మాఫియాకి ఏమాత్రం అడ్డుకట్ట పడటం లేదు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ జిల్లా నుంచే ప్రాతినిథ్యం వహిస్తున్నారన్న భయం కూడా మాఫియాలో ఇసుమంతైనా కనిపించడం లేదు. అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా తమకు అడ్డే లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నది. గత 12 రోజులుగా జిల్లాలో ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) ఆపరేటర్ల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ జరుగుతోన్నది. అయితే గతంలో వలే కేజీకి రూ.15 చొప్పున లెక్కించి కార్డుదారులకు నగదు ఇచ్చి ఆ బియ్యాన్ని దారి మళ్లించి సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కాకినాడ వద్ద బియ్యం తరలిపోకుండా కఠినమైన చర్యలను మంత్రి నాదెండ్ల మనోహర్ చేపట్టడంతో ఇప్పుడు రూటుమార్చి కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కలెక్టర్‌గా బూర్ల రామాంజనేయులు(ప్రస్తుత ప్రత్తిపాడు ఎమ్మెల్యే) ఉన్న సమయంలో పదేపదే బియ్యాన్ని నల్లబజారుకు తరలించిన వారిపై ఉక్కుపాదం మోపారు. అప్పట్లో పీడీ యాక్టు కేసులు నమోదు చేసి జిల్లా నుంచి బహిష్కరించారు. ఇప్పుడు కూడా అలాంటి కఠినమైన చర్యలు చేపట్టకపోతే రేషన్ మాఫియాకి ముకుతాడు పడటం కష్టమన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

దుకాణాలను చెరపట్టి..

వైసీపీ హయాంలో గుంటూరు పరిధిలో టీడీపీకి చెందిన కొంతమంది డీలర్లపై వేటు వేశారు. తొలుత పార్టీ మారమని ఒత్తిడి చేశారు. వారిలో కొందరు మారకపోవడంతో పౌరసరఫరాల అధికారుల ద్వారా దాడులు చేయించి స్టాకులో వ్యత్యాసం ఉందని చెప్పి వారిని సస్పెన్షన్ చేశారు. ఇలా నగరంలో 15 మంది డీలర్లను సస్పెన్షన్ చేసి ప్రత్యామ్నాయంగా పొదుపు సంఘాల మహిళలకు నిర్వహణ బాధ్యతలు కేటాయించారు. అయితే ఇది కేవలం కాగితాల్లో మాత్రమే. క్షేత్రస్థాయిలో ఆయా షాపులన్నీ మాఫియా చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఆయా సంఘాలకు నెలకు రూ.5 వేలు చెల్లిస్తూ షాపులను చెరబట్టిన మాఫియా ఎండీయూలను వారి దారిలోకి తెచ్చుకుంది. కార్డుదారుల నుంచి బియ్యం సేకరించి తెచ్చినందుకు ఎండీయూకు కేజీకి రూ.3 ఇస్తున్నారు. డీలర్లు మరో రూ.5 కమీషన్ చేర్చి కేజీ రూ.23కు మిల్లర్లకు అమ్ముతున్నారు.

రబ్బర్ వేలిముద్రలతో..?

రేషన్ మాఫియా తన కబంధ హస్తాల్లోకి తీసుకున్న దుకాణాల్లో ఎండీయూలకు బియ్యం సరఫరా చేసేందుకు నిత్యం ఈ-పోస్‌లో వేలి ముద్ర వేయాలి. డ్వాక్రా మహిళల పేరుతో ఉన్న షాపులకు సంబంధించి రబ్బర్ వేలి ముద్రలను మాఫియా తయారు చేయించిందన్న ఆరోపణలున్నాయి. నిత్యం షాపుల వద్దకు వారొచ్చి వేలిముద్రలు వేయాల్సిన అవసరం ఉండదు. గుంటూరులో రేషన్ మాఫియా కు నేతృత్వం వహిస్తున్న వ్యక్తికి చెందిన కుటుంబ సభ్యులకు కూడా షాపులున్నాయి. అవసరమైతే నెలకు రూ.15 లక్షలు ఇచ్చి అయినా తమ జోలికి ఎవరూ రాకుండా చేసుకొంటామన్న ధీమాని వ్యక్తపరుస్తున్నారు. పోలీసు, విజిలెన్స్, పౌరసరఫరాల శాఖలు తూతూ మంత్రంగా నమోదు చేస్తున్న కేసుల వల్ల రేషన్ మాఫి యాకి ఎలాంటి భయం అనేది లేకుండా పోయింది.

నియోజకవర్గాల వారీగా దళారీలు..

నియోజకవర్గాల వారీగా బియ్యం బ్లాక్ మార్కెట్ వ్యాపారాన్ని దళారీలు పంచుకున్నారనేది అందరికీ తెలిసిన విషయమే. వీరు మిల్లులను లీజుకు తీసుకుని వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. రాత్రి వేళ డీలర్ల నుంచి బియ్యం నిల్వలను ఎంపిక చేసుకున్న మిల్లులకు తరలిస్తారు. గోతాలు మార్చి 25 కిలోలు, 50 కిలోల ప్యాకింగ్ చేస్తారు. ఈ ప్రక్రియ అంతా రాత్రి వేళల్లో నిర్వహిస్తారు.

ఒక్కో నియోజక వర్గంలో ఒక్కొక్క రేటు బ్లాక్ మార్కెట్‌కు నిర్ణయించినట్లు సమాచారం. ఒక నియోజకవర్గంలో బియ్యం బ్లాక్ మార్కెట్ చేసే వ్యక్తుల నుంచి నెలకు రూ.28 లక్షలు చెల్లించే విధంగా ఓ నేతతో ఒప్పందం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరో నియోజక వర్గంలో రూ.20 లక్షలు చెల్లించేలా దళారీలు మరో నేతతో బేరం కుదు ర్చుకున్నట్లు సమాచారం. సంబంధిత శాఖల్లో కొందరు అధికారులకు నెలవారీ మామూ ళ్లు అందుతున్నట్లు తెలి సింది. గత ప్రభుత్వం అధికారంలో ఉండగా బియ్యం బ్లాక్ మా ర్కెట్ చేసిన వ్యక్తులే ఇప్పుడు కూడా కొనసాగిస్తున్నారని తెలిసింది.

నెలవారీ మామూళ్లు ఫిక్స్

వైసీపీ హయాంలో పాలకుల అండతో జిల్లాలో రేషన్ మాఫియా రెచ్చిపోయింది. గతంలో అక్కడికక్కడ స్వల్పంగా రేషన్ బియ్యం పక్కదారి పట్టేవి. అలాంటిది గడచిన ఐదేళ్లలో ఆ దందాను వ్యవస్థీకృతం చేశారు. నెలవారీ మామూళ్లు ఫిక్స్ చేసి మరీ దందాను కొనసాగించారు. ఈ దందాలో ఏకంగా వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలే సూత్రధారులుగా ఉండడంతో అధికారులు సైతం చేష్టలుడిగి చూస్తుండిపోయారు. బాపట్ల జిల్లా పరిధిలో పర్చూరు, చీరాలలో ఈ దందా అయితే వైసీపీ ప్రభుత్వంలో ఆకాశమే హద్దుగాసాగింది. రెండేళ్లలో మొత్తం 123 6ఏ కేసులు నమోదైతే చీరాల, బాపట్ల పరిధిలోనే 90 వరకు కేసులు నమోదు కావడం గమనార్హం. గతంలో ముగ్గురి మీద పీడీయాక్టు ప్రతిపాదనలను సిద్ధం చేసినా అప్పటి వైసీపీ ప్రభుత్వ ఒత్తిళ్లతో అది కాగితాలకే పరిమితమైంది. పర్చూరు నియోజకవర్గం కారంచేడు మండలం స్వర్ణలో వైసీపీ ప్రజాప్రతినిధి రైస్‌మిల్లులోనే రేషన్ దందా ఇటీవల వరకు యథేచ్ఛగా నడిచేది. ఆ మిల్లుపై జరిగిన దాడుల్లో విడతల వారీగా 700, 150, 400 బస్తాలను అధికారులు స్వాధీనం చేసుకున్నా దందాకు వైసీపీ హ యాంలో అడ్డుకట్టపడలేదు. చీరాలలో సైతం వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఈ దందా నడిచింది.



నరసరావుపేటలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం నిల్వలు (పాత చిత్రం)

బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట పడేనా ?

వైసీపీ హయాంలో బియ్యం బ్లాక్ మార్కెట్ చేయడంలో అక్రమార్కులు రెచ్చిపోయారు. అప్పట్లో కొన్ని చోట్ల టీడీపీ నేతలు బియ్యం అక్రమ నిల్వలను పట్టించిన విషయం తెలిసిందే. కూటమి అధికారంలోకి రావడంతో బియ్యం బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట వేస్తారా లేదా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన వారే. ఆయనకు గతంలో బియ్యం బ్లాక్ మార్కెట్‌పై పోరాటాలు చేసిన అనుభవం ఉంది. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం వేలాది క్వింటాళ్ల బియ్యం నిల్వలను కాకినాడ పోర్టులో సీజ్ చేయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెలలో బియ్యం నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు తరలి పోకుండా మంత్రి చర్యలు తీసుకుంటారన్న వాదన వినిపిస్తోంది. కార్డు దారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యం నిల్వలు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల వద్దే ఉన్నాయి. డీలర్ల వారీగా వారి వద్ద బియ్యం నిల్వలను తనిఖీ చేస్తే కొంత మేర బియ్యం బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుందని చెప్పవచ్చు. ఈ ప్రక్రియపై దృష్టి సారిస్తారో లేదో చూడాలి.

ప్రతి నెలా 1,18,325 టన్నులు బ్లాక్ మార్కెట్‌కు..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి ప్రతి నెల 1,18,325 టన్నుల బియ్యం బ్లాక్ మా ర్కెట్‌కు తరలిపోతున్నట్లు సమాచారం. పల్నాడు జిల్లాలో 6,45,110 కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 89,239 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తున్నా రు. బాపట్ల జిల్లాలో 4,84,029 కార్డులకు 63,446 టన్నులు, గుంటూరు జిల్లాలో 5,99,511 కార్డులకు 83,965 టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. బియ్యం సరఫరాపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. వీఆర్‌వో స్థాయి నుంచి జాయింట్ కలెక్టర్ వరకు బియ్యం సరఫరాను పర్యవేక్షించాల్సి ఉంది. రేషన్ షాపులను విధిగా తనిఖీ చేయాలని నిబంధనను కొందరు అధికారులు పాటించడంలేదు. దీంతో బియ్యం అక్రమార్కులు రెచ్చి పోతున్నారు.

బోగస్ గ్రూపులు అక్రమ రుణాలు

- వైసీపీ మాజీ కౌన్సిలర్ల కనుసన్నల్లో వ్యవహారం
- ఆర్పీలు, సీవోలు, అధికారులకు భారీగా కమీషన్లు
- ఆరోపణలు వెల్లువెత్తడంతో శెలవులో అధికారులు

అవినీతిమయంగా పొన్నూరు మెప్మా విభాగం

పొన్నూరు టౌన్, జూలై 12: పేదరిక నిర్మూలన.. మహిళల స్వావలంభనే మెప్మా లక్ష్యం. అయితే వైసీపీ హయాంలో ఐదేళ్ల బోగస్ గ్రూపులు.. అక్రమ రుణాలతో రూ.కోట్లు కొట్టేశారు. పొన్నూరు పురపాలక సంఘం పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన విభాగమైన మెప్మా అవినీతిమయంగా మారింది. 2019కు ముందు జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే పొదుపు రుణాలు పొందడం, చెల్లింపుల్లో పొన్నూరు మెప్మా విభాగం ప్రథమ స్థానంలో నిలిచింది. డ్వాక్రా మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించడమే కాకుండా రుణాలను సద్వినియోగం చేసుకుని ఎందరో రివార్డులు సైతం పొందారు. 2019 తర్వాత మెప్మా అవినీతి మయంగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో 150కి పైగా బోగస్ గ్రూపులు ఏర్పాటైనట్లు ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ నాయకులతో అంటకాగిన మెప్మా సిబ్బంది పట్టణంలో కొందరు అమాయక మహిళలతో గ్రూపులను ఏర్పాటు చేసి రుణాలు పొంది సొంతానికి వినియోగించుకున్నారన్నట్లు సమాచారం. వైసీపీ చెందిన ఇద్దరు మాజీ కౌన్సిలర్ల కన్నుసన్నల్లోనే ఈ తతంగమంతా సాగినట్లు తెలుస్తుంది. బ్యాంకుల మధ్య అనుసందానం లేకపోవడం, మెప్మా అధికారుల స్వీయ నిర్ధారణతోనే రుణాలు మంజూరు చేశారు. దీంతో బోగస్ గ్రూపులకు పెద్దఎత్తున రుణాలు మంజూరయ్యాయి. గాయత్రి పొదుపు సంఘం అనే బినామీ గ్రూపు పేరుపై ఓ బ్యాంక్‌లో రూ.10 లక్షలు రుణం మంజూరైనట్లు వెలుగు చూసింది. దీంతో మూడు రోజుల వ్యవధిలోనే ఆ రుణం మొత్తాన్ని జమ చేశారు. అనుమానం వచ్చిన బ్యాంక్ అధికారులు మెప్మా అధికారులను ప్రశ్నించడంతో వారి నుంచి సమాధానం కరువైంది. ఈ సంఘం సభ్యులు పట్టణంలోని 3, 4 వార్డుల్లో ఉండగా బినామి గ్రూప్ 27వ వార్డులో ఏర్పాటు కావటం గమనార్హం. అలాగే 8వ వార్డులో సుమారు 15కు పైగా బినామి గ్రూపులు ఏర్పాటై రూ.కోటికి పైగా రుణాలు పొందినట్లు సమాచారం. బోగస్ గ్రూపులకు ఓ ప్రైవేటు బ్యాంకు నుంచి రుణాలు అందాయి. ఆయా సంఘాలు రుణాలు చెల్లించకపోవటంతో బ్యాంకు అధికారులు నోటీసులు అందచేయడంతో మహిళలు ఆ రుణాలతో తమకు సంబంధం లేదని చె ప్పారు. దీంతో బ్యాంక్ అధికారులు అంతర్గత విచారణ ప్రారంభించారు. అసలు మెప్మా పరిధిలో లేని ప్రైవేటు బ్యాంక్ పొదుపు రుణాలు ఎలా మంజూరు చేసిందో తెలియ డం లేదు. మున్సిపాలి టీలో 1450 గ్రూపులు ఉండగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో అసాధారణ రీతిలో 663 గ్రూపులు రూ.92.53 కోట్లు రుణాలు పొందడం చర్చనీయాంశమైంది. 2019 నుంచి 2024 వరకు రూ.217.52 కోట్లు డ్వాక్రా రుణాలు మంజూర య్యాయి. బోగస్ గ్రూపులే కాకుండా రుణం మంజూరు చేయడానికి ప్రతి సంఘం వద్ద మెప్మా సిబ్బంది రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు అక్రమంగా వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. వివిధ బ్యాంకుల నుంచి అందుతున్న సమాచారం మేరకు సుమారు 100 గ్రూపులకు పైగా ఎన్‌పీఏ అయినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో మెప్మాలో పనిచేసే సిటీ మిషన్ మేనేజర్ ఇప్పటికే శెలవులో వెళ్లగా మరికొందరు శెలవు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.



పొన్నూరు మున్సిపల్ కార్యాలయం

తాగునీటికి ఇబ్బందులు రానియ్యం

- చెరువులో 15 రోజులకు సరిపడా నీరు
- సింగరచెరువును సందర్శించిన కలెక్టర్ అరుణ్‌బాబు

వినుకొండటౌన్, జూలై 12: గుండ్లకమ్మ నది నుంచి వినుకొండ పట్టణవాసులకు తాగునీరు సరఫరా చెయ్యాలని కలెక్టర్ అరుణ్‌బాబు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. తొలి ఏకాదశి పండుగ నిర్వాహణ సమీక్షలో భాగంగా శుక్రవారం వినుకొండకు వచ్చిన కలెక్టర్ పట్టణానికి తాగునీరు అందించే సింగరచెరువును ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువులో నీరు అడుగంటిందని దీంతో మరో 15 రోజులకు సరిపడా నీరు ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఎమ్మెల్యే సూచనల మేరకు గుండ్లకమ్మ నుంచి నీరు సరఫరా చేయాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగర్ డ్యామ్‌లో నీరు డెడ్ స్టోరేజిలో ఉండడం వల్ల నీటి విడుదల ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. వినుకొండకు దగ్గరగా, చీకటీగలపాలెం అడ్డరోడ్డు వద్ద గుండ్లకమ్మ నుంచి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. తాగునీటి విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. జిల్లాలో నెలకొన్న తాగునీటి సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. కృష్ణారివర్ బోర్డుతో చర్చించి, త్వరలో సాగర్‌కు నీరు విడుదలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దస్తగిరి, కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి, నాగరాజు, కమిషనర్ తోట కృష్ణవేణి, డీఈఈ వెంకయ్య, టీడీపీ నాయకులు పీవీ సురేష్‌బాబు, షమీమ్‌ఖాన్, పువ్వాడ కృష్ణ పాల్గొన్నారు.



సింగర చెరువు వద్ద కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే ఆంజనేయులు



7లో..

నేడు కొలనుకొండలో సీఎం పర్యటన

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ తుషార్ డూడి

తిరుమలకు అమరావతి పాదయాత్ర



- కృతజ్ఞతా యాత్రగా వెంకన్న సన్నిధికి రైతులు

తుళ్లూరు, జూలై 12: మూడు రాజధానుల పేరుతో తమను ఇబ్బంది పెట్టిన వైసీపీ ఓడిపోవాలని.. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావాలని మొక్కుకున్న అమరావతి రైతులు పాదయాత్రగా శుక్రవారం తిరుమలకు చేరుకున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో తుళ్లూరు మండలం వెంకటపాలెం వేంకటేశ్వర స్వామి సన్నిధి నుంచి తిరుమలకు రాజధాని మహిళలు 30 మంది కృతజ్ఞతా పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. గత నెల 24న ప్రారంభమైన ఈ యాత్ర శుక్రవారం తిరుపతికి చేరుకుంది. అలిపిరి నుంచి మెట్ల మార్గంలో నడక దారి గుండా శ్రీవారి సన్నిధికి చేరుకున్నారు.

మా అల్లుడని డబ్బులిచ్చి ఆదుకున్నాం

లావణ్య తల్లితండ్రులు



ప్రస్తుతం టాలీవుడ్‌లో నటుడు రాజ్‌తరుణ్, లావణ్య వ్యవహారం ఓ హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటివరకూ లావణ్య మాత్రమే మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు ఆమె తల్లితండ్రులు కూడా మీడియా ముందుకు వచ్చి ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. చెప్పుకోలేని సంఘటనలు జరిగాయని కన్నీళ్లు పెట్టుకున్నారు. కరోనా సమయంలో రాజ్‌తరుణ్‌కి ఎవరూ సాయం చేయకపోయినా అతన్ని అల్లుడిగా భావించి డబ్బు సాయం చేసి ఆదుకున్నట్లు వారు చెప్పారు. 'మా అమ్మాయికి రాజ్‌తరుణ్ అన్యాయం చేశాడు. అతను ఎక్కడున్నా తీసుకువచ్చి వాళ్లిద్దరినీ కలిపేవరకూ వెనుకంజ వేయం' అని లావణ్య తండ్రి స్పష్టం చేశారు. లావణ్యకు డ్రగ్స్ తీసుకునే అలవాటు లేదనీ, అక్రమ సంబంధాలు ఉన్నాయనడం కట్టుకథ అనీ, ఓ ఆడపిల్ల మీద ఇలా నిందలు వేయడం తగదనీ ఆయన అన్నారు. తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయనీ, 'డ్రగ్స్ కేసులో నువ్వు బెయిల్ మీద బయటకు వచ్చావనీ, ఇలాంటి న్యూసెన్స్ చేస్తే బెయిల్ రద్దయి, ఇక జైలు నుంచి తిరిగి రాలేవని రాజ్‌తరుణ్, హీరోయిన్ మాల్వి బెదిరించారని లావణ్య చెప్పారు. రూ. ఐదు కోట్లు ఇచ్చి సెటిల్‌మెంట్ చేసుకుంటామని, కేసు వెనక్కి తీసుకోమని కూడా చెబుతున్నారని ఆమె వెల్లడించారు. 'నేను డ్రగ్స్ తీసుకుని ఉంటే రాజ్‌తరుణ్ కూడా తీసుకున్నట్లే. నేను వాటిని అమ్మితే .. అమ్మించింది అతనే. ఇందులో నిజం ఏమిటో పోలీసులే తేల్చాలి' అన్నారు లావణ్య. 'ఈ పోరాటం ఆపను. రాజ్ ఎక్కడ ఉంటే అక్కడికి వెళతాను. 14 ఏళ్ల పరిచయం, పదేళ్ల సహజీవనం ఎలా కాదంటాడో నేనూ చూస్తా' అని స్పష్టం చేశారు లావణ్య.

చిన్న సినిమా... వసూళ్లలో మిన్న

ఈ మధ్యకాలంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన చాలా చిత్రాలు బాక్సాఫీసు దగ్గర వసూళ్ల సునామీ సృష్టించడం చూసిందే. రూ. 300 కోట్లు, రూ. 500 కోట్ల వసూళ్లు అనే మాట చాలా సామాన్యంగా వినిపిస్తోంది. కానీ అవన్నీ భారీ బడ్జెట్‌తో తెరకెక్కడం వల్లే వసూళ్లు కూడా ఖర్చుకు తగిన స్థాయిలో వచ్చాయి. కానీ పరిమిత బడ్జెట్‌తో, అది కూడా ఎలాంటి స్టార్స్ లేకుండా వచ్చిన కొన్ని బాలీవుడ్ సినిమాలు రూ. వంద కోట్ల వసూళ్లను సాధిస్తున్నాయి. అగ్రహీరోలు, దిగ్గజ దర్శకులు లేకున్నా ఆకట్టుకునే కథలతో ప్రేక్షకులను అలరిస్తూ, కాసుల వర్షం కురిపిస్తున్నాయి.

ఓ సినిమా కమర్షియల్‌గా హిట్టా, ఫట్టా అనేది చెప్పడానికి రూ. 100 కోట్ల వసూళ్లు అనేది ఇప్పుడు ఓ కొలబద్దగా మారింది. అయితే అగ్రతారలకు సైతం అన్నిసార్లు ఈ ఫీట్ సాధ్యం కావడం లేదు. భారీ హైప్‌తో వచ్చిన పాపులర్ హీరోల చిత్రాలు సైతం బాక్సాఫీసు దగ్గర రూ. వంద కోట్ల వసూళ్లను దాటలేక చతికిలపడుతున్నాయి. దీనికి భిన్నంగా ఎలాంటి స్టార్స్ లేకుండా, కంటెంట్‌ను మాత్రమే నమ్ముకొని వచ్చిన కొన్ని చిన్న సినిమాలు బాలీవుడ్‌లో అలవోకగా వందకోట్ల మార్క్‌ను అధిగమిస్తున్నాయి.





కోట్లు కొల్లగొట్టిన పిల్లదెయ్యం

బాలీవుడ్ తాజా సంచలనం 'ముంజ్యా' చిత్రం రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరింది. హారర్ కామెడీ జానర్ సత్తా ఏంటో మరోసారి చూపింది. ఇందులో పేరున్న బాలీవుడ్ తారాగణం లేదు. శార్వరీ వాఘ్, అభయ్ వర్మ లాంటి చిన్న నటీనటులే. దర్శకుడు ఆదిత్య సర్పోదర్‌కు గతంలో భారీ హిట్లు ఇచ్చిన వ్యక్తి కాదు. అయినా 'ముంజ్యా' మాత్రం విడుదలైన రెండు వారాల్లోనే రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరింది. రూ. 30 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్ల వసూళ్లను సాధించింది. ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రాల్లో ఐదో స్థానంలో నిలిచింది.

అగ్రతారలు లేకున్నా కాసుల వర్షం

సీనియర్ నటీమణులు కరీనాకపూర్, టబు... యువ కథానాయిక కృతీసనన్ ప్రధాన తారాగణంగా రూపొందిన హీరోయిన్ ఓరియంటెడ్ మూవీ 'క్రూ' సైతం అంచనాలు మించి వసూళ్లను అందుకొంది. ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడడంతో దాదాపు 2500 స్క్రీన్లలో ఈ చిత్రాన్ని విడుదల చేశారు. ఈ కామెడీ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్ల వసూళ్లను సాధించింది. స్టార్ హీరోల రేంజ్‌లో ఈ చిత్రం వసూళ్లను సాధించడం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరిచింది.

కంటెంట్‌తోనే కలెక్షన్లు

కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో రూపొందిన హిందీ చిత్రం 'ఆర్టికల్ 370'. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైంది. రూ. 20 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం రూ. 110 కోట్ల వసూళ్లను సాధించింది. కథానాయికగా ఇప్పటివరకూ పెద్ద విజయాలు దక్కని యామీ గౌతమ్ ఈ సినిమాలో లీడ్‌రోల్ పోషించగా, ప్రియమణి కీలకపాత్రలో నటించారు. వీరు తప్ప పేరున్న నటీనటులెవరూ ఈ చిత్రంలో లేరు. ఆర్టికల్ 370ని తొలగించే క్రమంలో ప్రభుత్వానికి ఎదురైన సవాళ్లు, లోయలో శాంతి భద్రతలను కాపాడేందుకు మిలిటరీ చేసిన ఆపరేషన్స్‌ను దర్శకుడు ఆదిత్య సుహాస్ ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను మెప్పించింది. ఫలితమే బాక్సాఫీసు దగ్గర మంచి మార్కులు కొట్టేసింది.


సక్సెస్ బాటలో చిన్న సినిమా

కరోనా ప్రభావానికి బలైన చిత్రపరిశ్రమల్లో బాలీవుడ్‌ది అగ్రస్థానం. అప్పటివరకూ వరుస హిట్లతో కళకళలాడిన పరిశ్రమ కాస్తా ప్రేక్షకులు థియేటర్లకు రాక వెలవెలబోయింది. వరుస అపజయాలతో అగ్రహీరోలు, నిర్మాతలకు ఏం పాలుపోని పరిస్థితి. ఇంకా ఇప్పటికీ బాలీవుడ్ మునుపటి జోరు చూపించలేకపోతోంది. అగ్రహీరోలతో రూ. వందల కోట్లు ఖర్చుపెట్టి సినిమాలు తీసిన కొన్ని పెద్ద నిర్మాణ సంస్థలు దివాళా అంచుకుచేరాయి. ఈ పరిస్థితి ఇలా కొనసాగుతుండగా కొత్త తరహా కంటెంట్‌తో వచ్చిన కొన్ని చిన్న చిత్రాలు బాక్సాఫీసును దునేస్తున్నాయి.





అయితే కొంతమంది విమర్శకులు ప్రాపగాండా చిత్రాలుగా పేర్కొన్న 'ది కేరళ స్టోరీ', 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రాలు ఆశ్చర్యపరిచే వసూళ్లను సాధించాయి. మత మార్పిడికి గురైన అమాయక యువతి చివరకు సరిహద్దులు దాటి ఉగ్రవాద సంస్థ ఐసిస్ చెరలో బంధీగా మారిన వైనాన్ని ఇందులో చూపించారు. అదాశర్మ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో పేరున్న బాలీవుడ్ నటీనటులు లేరు. కథ కూడా పూర్తిగా కేరళ నేపథ్యంలో సాగుతుంది. దక్షిణాదిన ఈ సినిమాకు కమర్షియల్‌గా లాభించకపోయినా ఈ సినిమా హిందీ వెర్షన్‌ను ప్రేక్షక లోకం అమితంగా ఆదరించింది. అందుకే రూ. 20 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం ఏకంగా రూ. 250 కోట్ల వసూళ్లతో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 2022లో వచ్చిన 'కశ్మీర్ ఫైల్స్' చిత్రం సైతం రికార్డులను తిరగరాసిందనే చెప్పాలి. ఒక డాక్యుమెంటరీలా సాగే కథనంతో తెరకెక్కిన ఈ సినిమా ఊహించని వసూళ్లను సాధించింది. తొలి రోజు 600 స్క్రీన్లలో విడుదల చేస్తే, వారం తిరగకుండానే నాలుగు వేల స్క్రీన్లకు పెంచాల్సి వచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో రూ. 20 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రం కాస్తా రూ. 300 కోట్ల వసూళ్ల మార్క్‌ను అధిగమించింది. బాలీవుడ్‌లో విక్కీ కౌశల్‌కు ఒక్కసారిగా స్టార్‌డమ్ సంపాదించిపెట్టిన చిత్రం 'యురి' కేవలం రూ. 25 కోట్ల వ్యయంతో తెరకెక్కింది. ఈ చిత్రం హిందీ బెల్ట్‌లోనే రూ. 250 కోట్ల వసూళ్లను రాబట్టింది. ప్రపంచవ్యాప్తంగా రూ. 350 కోట్ల వసూళ్లను రాబట్టింది. పలువురు అగ్రహీరోల చిత్రాలను పక్కకునెట్టి 2019లో అత్యధిక వసూళ్లు సాధించిన మూడో చిత్రంగా నిలిచింది.




విజిలేస్కో...

తమిళ హీరో విజయ్ కథానాయకుడిగా వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది గోట్' (గ్రేటస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). శుక్రవారం చిత్ర బృందం తొలి పాటను విడుదల చేసింది. 'విజిలేస్కో' అంటూ సాగే ఈ మాస్ గీతానికి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. యువన్ శంకర్ రాజా స్వరాలు సమకూర్చడంతో పాటు నకాష్ అజీజ్‌తో కలసి ఆలపించారు. ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ, లైలా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బేనర్ నిర్మిస్తోంది. సినిమాటోగ్రఫీ: సిద్దార్థ నుని.

ఆర్.సి 16లో శివన్న



రామ్‌చరణ్, జాన్వీ కపూర్ జంటగా రూపొందుతున్న ఆర్.సి. 16 చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ శుక్రవారం వచ్చింది. చిత్ర పరిశ్రమలో అందరూ ఆప్యాయంగా 'శివన్న' అని పిలుచుకునే శివ రాజ్‌కుమార్ ఇందులో నటిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా సినిమాలో ఆయన లుక్‌ను విడుదల చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. 'ఉప్పెన' చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. సంగీత సంచలనం ఏ.ఆర్.రెహమాన్ ఈ సినిమాకు స్వరాలు అందిస్తున్నారు.



అప్పుడు సోలో.. ఇప్పుడు యుగళం

లవ్, రొమాంటిక్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్.. ఈ జానర్లలో రూపుదిద్దుకునే చిత్రాలను ప్రేక్షకులకు దగ్గర చేసేవి వాటిల్లో పాటలే. సంగీతం ఇంత ముఖ్య పాత్ర పోషిస్తుంది కనుక పాటల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంటారు. ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నటిస్తున్న 'డార్లింగ్' చిత్రం నుంచి ఇప్పటి వరకూ రెండు పాటలు విడుదలయ్యాయి. ఇవి ప్రియదర్శి, నభా నటేశ్‌ల సోలో సాంగ్స్. ఇప్పుడు వీరిద్దరూ కలిపి పాడుకున్న లవ్ సాంగ్ 'నువ్ చెలియా' ను శుక్రవారం విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి పాడారు. వివేక్ సాగర్ సంగీత దర్శకుడు. ఈ నెల 19న విడుదల కానున్న ఈ చిత్రాన్ని అశ్విన్ రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించారు.

ప్రేమకథలు జీవితకాలం వెంటాడుతాయి



సంతోష్ శోభన్, సోషల్ మీడియాలో పాపులర్ అయిన అలేఖ్య హారిక జంటగా ఓ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఎస్.కె.ఎన్., దర్శకుడు సాయిరాజేశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. సుమన్ పాతూరి దర్శకుడు. హీరో సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఇందులో ఉన్న 'ప్రేమకథలు జీవితకాలం వెంటాడుతాయి' అనే క్యాప్షన్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే ఈ చిత్రం మ్యూజిక్ సిట్టింగ్స్ సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ సారథ్యంలో ప్రస్తుతం జరుగుతున్నాయి.

అక్షయ్‌కుమార్‌కు కరోనా



చిత్ర ప్రముఖుల్ని కరోనా రక్కసి ఇంకా వదిలి పెట్టలేదు. తాజాగా బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ ఈ రక్కసి చేతికి చిక్కారు. ప్రపంచ కుబేరుడు ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ వివాహానికి వెళ్లడం కోసం శుక్రవారం కొవిడ్ టెస్ట్ చేయించుకున్నారు. పాజిటివ్ రావడంతో పెళ్లికి వెళ్లడం మానుకుని ఇంటి గదికి పరిమితం అయ్యారు. తమిళంలో హిట్ అయిన సురారై పోట్రు' చిత్రం ఆధారంగా రూపొందిన 'సర్ఫిరా' చిత్రం శుక్రవారం విడుదల అయింది. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఇటీవల చాలా చోట్లకు వెళ్లారు అక్షయ్. అప్పుడే ఆయనకు వైరస్ సోకి ఉంటుందని అంటున్నారు.

నా ఫ్లాపుల్ని ఎంజాయ్ చేస్తున్నారు

'సర్ఫిరా' ప్రమోషన్స్‌లో భాగంగా అక్షయ్ ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'నా ఫ్లాపుల్ని చూసి కొంతమంది ఎంజాయ్ చేస్తున్నారు. పరిశ్రమలో ఇలాంటి రాజకీయాలు బాధ కలిగిస్తున్నాయి' అని ఆవేదనతో చెప్పారు. ఏడాదికి నాలుగు సినిమాలు చేస్తూ, ఓవర్ ఎక్స్‌పోజ్ అవుతున్నాడంటూ వచ్చిన కామెంట్స్ ను ఆయన కొట్టి పడేశారు. 'నేను రెండేళ్లకు ఒక్క సినిమానే చేస్తా. అది హిట్ అవుతుందని ఎవరైనా గ్యారంటీ ఇవ్వగలరా?' అని అక్షయ్ ప్రశ్నించారు. 'వర్క్ చేస్తూనే ఉండాలి. నీ దగ్గరకు వచ్చిన అవకాశాల్ని పోగొట్టుకోకు. ఎవరి మాటా వినకు. నీ నటన ప్రేక్షకులకు నచ్చితే వాళ్లే నిన్ను నెత్తిన పెట్టుకుంటారు' అని అమితాబ్ చెప్పిన మాట పాటిస్తున్నా' అని చెప్పారు అక్షయ్.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్
https://ejyothy.com/bmGd9pLలో చదవండి.



సీపీఎం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో ప్రసంగిస్తున్న పాలిట్‌బ్యూరో సభ్యుడు బేబి

మతతత్వ బీజేపీని తిరస్కరించిన ప్రజలు

● సీపీఎం పాలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబి

తాడేపల్లి, జూలై 12: కేంద్రంలో బీజేపీ మతతత్వ రాజకీయాలను, రాజ్యాంగ మార్పు ప్రయత్నాలను ప్రజలు అడ్డుకున్నారని, అందువలనే 2024 ఎన్నికల్లో పట్టుకోల్పోయిందని సీపీఎం పాలిట్‌బ్యూరోసభ్యుడు ఎంఏ బేబి అన్నారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని సుందరయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శుక్రవారం ప్రారంభమైన సీపీఎం రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ఎంఏ గఫూర్, కే లోకనాథం, డీ రమాదేవి, పి అప్పలనరస అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. బేబి మాట్లాడుతూ దేశంలో అనేక పార్టీలు బీజేపీ తీరును తీవ్రంగా వ్యతిరేకించాయని, అందుకే బీజేపీ పెద్దలు ఇద్దరు సీఎంలను జైలులో పెట్టించి నియంతృత్వంగా వ్యవహరించారని విమర్శించారు. బీజేపీ ఫాసిస్టు విధానాలను అర్థం చేసుకోలేని కొన్ని ప్రాంతీయ పార్టీల వలన దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి ఓట్లు పెరిగాయన్నారు. పార్లమెంటులో పూర్తిమెజారిటి లేకపోయినా నియంతృత్వ విధానాలు కొనసాగిస్తుందని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కూటమి నేతలు ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలు, సూపర్-6 పథకాల అమలుకు షెడ్యూలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ మైనార్టీల సంక్షేమానికి ప్రకటించిన హామీల అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాజధాని అమరావతి నిర్మాణంలో జాగువద్దని సూచించారు. సీపీఎం పాలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ.. విశాఖ రైల్వే జోన్, విభజనహామీలు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, తదితర విషయాలలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని టీడీపీ జనసేనలు ప్రతిఘటించాలని అన్నారు. మతోన్మాద బీజేపీని ప్రతిఘటించాల్సిన బాధ్యత వామపక్షాలపై ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పీ మధు, కార్యవర్గసభ్యులు వీ వెంకటేశ్వర్లు, పాశం రామారావు, జొన్నా శివశంకర్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలనుకొండలో నేడు చంద్రబాబు పర్యటన

● ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ తుషార్ డూడి

తాడేపల్లి, జూలై 12: గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండలోని హరేకృష్ణ గోకుల్ క్షేత్రంలో శనివారం ఉదయం 8.30 గంటలకు జరగనున్న అనంత శేష స్థపన కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు పాల్గొంటున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ తుషార్ డూడి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్ శుక్రవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి పూజా కార్యక్రమ స్థలంతోపాటు సభాస్థలి ప్రాంతాన్ని పరిశీలించారు. భక్తులు వలంటీర్లు కూర్చునే గ్యాలరీని పరిశీలించి సూచనలు అందించారు. వాహనాల పార్కింగ్ బారికేడ్లు పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. బందోబస్తు ఏర్పాట్లతోపాటు క్రౌడ్ మేనేజ్‌మెంట్‌ను సజావుగా చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. కార్యక్రమానికి ఎలాంటి అవాంతరం లేకుండా నిరంతర విద్యుత్ శక్తి ఉండేలా తగు ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఫైర్ సేఫ్టీ వాహనాలు, మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌వో విజయలక్ష్మి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరెడ్డి, తాడేపల్లి తహశీల్దార్ విజయకుమార్, హరేకృష్ణ గోకుల్ క్షేత్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

19న అరుణాచలంనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

గుంటూరు, జూలై 12: ఈనెల 21న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి 19న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 20వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బసచేసి 21న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదేరోజు సాయంత్రం బయల్దేరి 22వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 బస్సు సర్వీస్ నెంబర్‌కు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోచార్జీ రూ.2420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 73828 97459 సంప్రదించాలని కోరారు.

3 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

చేబ్రోలు, జూలై 12: నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 3 టన్నుల రేషన్ బియ్యాన్ని చేబ్రోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం గురువారం అర్ధరాత్రి గుంటూరు వైపు నుంచి చుండూరు వైపు వెళ్తున్న ఆటోను నారాకోడూరు గ్రామం వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఆటోలో రేషన్ బియ్యాన్ని గుర్తించి చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సుబ్బారావు అనే వ్యక్తికి చెందిన ఆటోగా గుర్తించారు. ఆటో డ్రైవర్ రామారావుపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకోవటమే కాకుండా సుబ్బారావు కోసం పోలీసులు గాలిస్తున్నారు.

విజ్ఞాన్స్‌లో 'డార్లింగ్' సినిమా యూనిట్ సందడి



డార్లింగ్ యూనిట్ సభ్యులతో లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

గుంటూరు(విద్య), జూలై 12: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శుక్రవారం సినీ హీరో ప్రియదర్శి తన 'డార్లింగ్' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా సందడి చేశారు. కార్యక్రమంలో హీరో ప్రియదర్శి, హీరోయిన్ నభా నటేష్, దర్శకుడు అశ్విన్ రామ్, ఇతర సినిమా సిబ్బంది పాల్గొన్నారు. యూనిట్ బృందాన్ని విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్‌చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు అభినందించారు.

నెలరోజుల చంద్రబాబు పాలన అద్భుతం

పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 12: నెలరోజుల చంద్రబాబు నాయుడు పాలన అద్భుతంగా ఉందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నా రు. పరిపాలన మొదలుపెట్టిన వెంటనే అవ్వాతాతలకు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌ని రూ.4వేలకు పెంచి ఇచ్చారన్నారు. సచివాల య ఉద్యోగుల ద్వారా ఒకటో తేదీనే పెన్షన్లు పంపిణీ చేసి సుసా ధ్యం అని నిరూపించారన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని తెచ్చి భవననిర్మాణరంగంపై ఆధారపడిన అనేక రంగాల కార్మికుల కుటుంబాలలో సంతోషాన్ని నింపారన్నారు. ఒక దార్శనికుడు అధికారం చేపట్టడంతో గతంలో రాష్ట్రం వీడివెళ్లిపోయిన అనేకమం ది మరలా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి క్యూ కడుతున్నార న్నారు. విభజన హామీలలో భాగంగా ఇరు రాష్ట్రాల మధ్య సమస్య లపై సయోధ్య కుదుర్చుకునేందుకు తెలంగాణ ముఖ్యమంత్రితో సమావేశమై మరొక అడుగు ముందుకు వేశారన్నారు. భోగాపురం విమానాశ్రయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు ప్రణాళిక లు రూపొందించారని చెప్పారు. పట్టిసీమ నీటిని కృష్ణమ్మ చెంతకు తెచ్చి రైతాంగానికి నీటి కష్టాలను తీర్చారని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 16347 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. రాష్ట్రానికి అమరావతే రాజధాని అంటూ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో గాడితప్పిన పాలనను సక్రమమార్గంలో పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి

● డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వినతి



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు వేచివున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

మంగళగిరి, జూలై 12: రాష్ట్రంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్స్ ద్వారా వైద్య సేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌కు శుక్రవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 2023లో నేషనల్ హెల్త్ మిషన్‌లో 160 కేడర్లకు వేతనాలు పెంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు మొండిచెయ్యి చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా జీతంతోపాటు చెల్లించవలసిన ఇన్సెంటివ్స్ గత ఏడు నెలల నుంచి పెండింగ్‌లో వున్నాయని, రకరకాల ఇండికేటర్ల నెపంతో అయిదు వేల మందిని ఇన్సెంటివ్‌కు అనర్హులుగా పరిగణించి అన్యాయం చేస్తున్నారని తెలిపారు. విలేజ్ క్లినిక్స్ అద్దెలు, కరెంటు బిల్లులు 8 నెలలుగా బకాయి వున్నాయన్నారు. కేంద్రం మార్గదర్శకాల ప్రకారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులరైజ్ చేయాలని, తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పులి ప్రేమ్‌కుమార్, ప్రియాంక, ప్రమోద్, నరేష్, వర్మ, సాయి, మనోజ్, మధు సుధాకర్, అపర్ణ, సాయికుమార్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

గుండిపార్వతీ అమ్మవారి దేవస్థానంలో చోరీ

● రూ.6లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్ళిన దుండగులు

భట్టిప్రోలు, జూలై 12: మండల కేంద్రం భట్టిప్రోలు హిందూ శ్మశాన వాటికలో ఉన్న శ్రీ గుండిపార్వతీ అమ్మవారి దేవస్థానంలో చోరీ జరిగింది. గురువారం రాత్రి పూజా కార్యక్రమాల అనంతరం తాళం వేసి వెళ్ళిన అర్చకులు శుక్రవారం ఉదయం వచ్చి చూసే సరికి తాళాలు పగులకొట్టి ఉండడం, హుండీ లేకపోవడంతో దేవస్థాన కమిటీ సభ్యులకు తెలియజేశారు. సభ్యులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ పసుపులేటి రామకృష్ణ, ఎస్ఐ కాసుల శ్రీనివాసరావులు పరిశీలించి వివరాలను సేకరించారు. బాపట్ల నుంచి వచ్చిన క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. సుమారుగా రూ.6లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని, వీటితో పాటుగా పంచలోహ విగ్రహాలు, హుండీని పగులకొట్టి గోడ అవతల పారవేశారని కమిటీసభ్యులు ఫిర్యాదులు పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ ఇంటికి నోటీసులు

తుళ్లూరు, జూలై 12: నదీపాతంలో ఎటువంటి కట్టడాలు నిర్మించ కూడదు. అటువంటిది నిబంధనలకు విరుద్ధంగా బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ నిర్మాణం చేపట్టడంతో సీఆర్డీఏ, ఉద్దండ్రాయునిపాలెం పంచాయతీ గురువారం నోటీసులు జారీ చేసింది. అంతేకాకుండా సీడ్ రోడ్డు పక్కన సీఆర్డీఏ భూములు ఆక్రమించి కార్యాలయం, ఫుట్‌బాల్ కోర్టు తదితర నిర్మాణాలు చేశారు. వాటికి కూడా నోటీసులు ఇచ్చారు. దీనిపై వారంరోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని సీఆర్డీఏ అధికారులు, పంచాయతీ సంయుక్తంగా నోటీసులు జారీ చేశాయి.

సీఎంఏ ఫౌండేషన్‌లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో అన్నా నందకిశోర్ తదితరులు

గుంటూరు(విద్య), జూలై 12: జాతీయస్థాయిలో ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసి సీఎంఏ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించారని చైర్మన్ అన్నా నందకిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు ఎస్కే ఫిర్దోస్ 316 ర్యాంకు, బి.నరసింహసాయి ధీరజ్ 312, బి.వెంకటశివకార్తీక్ 310, ఎస్.భవన్ వెంకటసాయి 304, కె.తిరుమల సాయిసంతోష్ 304, వి.శరణ్యలక్ష్మి, బి.రాహుల్ 302, ఎన్.భవ్యసాయి, ఎస్.కిషోర్, ఎస్కే సలామ్ 300 ర్యాంకులు సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

రేవుల వేలంపాట వాయిదా



రేవుల వేలంపాట కోసం జిల్లా పరిషత్‌కు వచ్చిన పాట దారులు

గుంటూరు సిటీ, జూలై 12: గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ ఆధీనంలోని రేవులకు, బల్లకట్టులకు నిర్వహించాల్సిన వేలంపాట మరోసారి వాయిదా పడింది. వేలంపాటలో పాల్గొనేందుకు శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి పలువురు జిల్లా పరిషత్‌కు చేరుకున్నారు. సీల్డ్ టెండర్లు దాఖలు చేస్తున్న సమయంలోనే అధికారులు పడవలు, బల్లకట్లకు సంబంధించిన ధ్రువపత్రాలు ఉండాలని స్పష్టం చేయటంతో కొద్ది సేపు సందిగ్ధం ఏర్పడింది. పాటదారులకు పడవలు, బల్లకట్టు నిర్వహణకు సంబంధించిన లైసెన్స్ ఫిట్నెస్, ఇన్సూరెన్స్ సరంగు లైసెన్స్ కచ్చితంగా ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. అవేవీ పాట దారుల వద్ద లేవని తేలటంతో వేలంపాట వాయిదా వేస్తున్నట్లు జడ్పీ డిప్యూటీ సీఈఓ జె.మోహన్‌రావు తెలిపారు. వేలంపాట తేదీని మళ్ళీ ప్రకటిస్తామని వెల్లడించారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



శ్రీహర్ష మృతదేహం

నాదెండ్ల, జూలై 12: మండలంలోని సాతులూరు గ్రామ పరిధిలో ఒక ఇంటిలో అద్దాలు బిగిస్తూ చెరుకూరి శ్రీహర్ష(23) శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అప్పాపురం గ్రామానికి చెందిన శ్రీహర్ష గ్లాసుఫిట్టింగ్ కార్మికుడిగా పని చేస్తుంటాడు. శ్రీహర్ష చిన్నతనంలోనే తండ్రి మరణించాడు. తల్లి లక్ష్మీతో పాటు తమ్ముడు మార్క్‌తో కలసి నివశిస్తున్నాడు. ఇంకా వివాహం కాలేదు. నూతన గృహాల్లో అద్దాలు బిగించే పనికి వెళ్తూ కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉంటున్నాడు. శుక్రవా రం సాతులూరు గ్రామంలోని నూతనంగా నిర్మించిన ఒక ఇంట్లో రెండో అంతస్తులో అద్దాలు బిగిస్తుండగా విద్యుతాఘాతానికి గురయ్యాడు. తోటి కార్మికులు అతన్ని చికిత్స కోసం నరసరావుపేట తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తల్లి లక్ష్మీ ఫిర్యాదుమేరకు నాదెండ్ల ఎస్ఐ బల రామిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



టిడ్కో గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు తదితరులు

టిడ్కో గృహ లబ్ధిదారులందరికీ త్వరలో మంచిరోజులు

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 12: టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులందరికీ త్వరలోనే మంచిరోజులు రాబోతున్నాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. వైసీపీ హయాంలో వారికి పూడ్చలేని నష్టం జరిగిందని, సాధ్యమైనంత త్వరగా ఆ కష్టాల నుంచి ఉపశమనం కలిగించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. శుక్రవారం చిలకలూరిపేటలో టిడ్కో ఇళ్ళ సముదాయాన్ని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలతో కలసి ప్రత్తిపాటి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకలూరిపేటలో నివాసం లేని నిరుపేదలకు 4500 టిడ్కో గృహాలను 2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం అందజేసిందన్నారు. నాటినుంచి గత పాలకుల దౌర్జన్యం, అరాచకాల వల్ల కనీసం ఒక్కరిని కూడా గృహప్రవేశం చేయనివ్వకపోవటం దుర్మార్గం అన్నారు. టిడ్కోఇళ్ళపై లోన్‌లు తీసుకున్న లబ్ధిదారులపై బ్యాంకర్లు కూడా ఒత్తిడి పెంచుతుంటే ఏంచేయాలో పాలుపోని స్థితిలో పడిపోయారన్నారు. ముందుగా జంగిల్ క్లియరెన్స్ చేయాలని, పోలీసు ఔట్‌పోస్టు పెట్టాలని, పాఠశాల ఏర్పాటుచేయాలన్నారు. ఇంతకాలం లబ్ధిదారులను బెదిరించి టిడ్కో ఇళ్ళ వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డ అందరిపై కఠినచర్యలు తీసుకుంటామని ప్రత్తిపాటి హెచ్చరించారు. సదుపాయలన్నీ కల్పించి లబ్ధిదారులందరినీ గృహప్రవేశాలు చేయించటానికి ఏర్పాట్లు చేయబోతున్నామని తెలిపారు. మరో 2వేల ఇళ్ళు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన చేశామని, ఫౌండేషన్ లెవల్‌కు కూడా వచ్చిందన్నారు. వాటిని కూడా పూర్తిచేసి లబ్ధి దారులకు అందిస్తామన్నారు. అనంతరం ఎంపీ కృష్ణదేవరాయలు మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయంలో నివశిస్తున్న ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలు తప్పక పరిష్కరిస్తామని, ఇక్కడ సచివాలయం, రేషన్ దుకాణం, పీహెచ్‌సీ ఏర్పాటుకు కృషిచేస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియంపై జీఎస్టీ ఉపసంహరించాలి

● ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు విజ్ఞాపన



ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు వినతిపత్రం అందజేస్తున్న బీమా ఉద్యోగులు

గుంటూరు(తూర్పు), జూలై 12: బీమా ప్రీమియంపై విధిస్తున్న 18శాతం జీఎస్టీ ఉపసంహరించాలని కోరుతూ శుక్రవారం, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు బీమా ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. అంతేగాక పాలసీదారులు చెల్లించే బీమా ప్రీమియంకు సెక్షన్ 80సి కింద ప్రత్యేక ఇన్‌కమ్‌ట్యాక్స్ రాయితీలు కల్పించాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యబీమాపై సెక్షన్ 80డి కింద రద్దుచేసిన రాయితీలను నూతన ఐటీ విధానం కింద పునరుద్ధరించాలని కోరారు. ముఖ్యంగా ప్రభుత్వ రంగంలోని నాలుగు సాధారణ బీమా సంస్థలను విలీనం చేయడం దేశ ఆర్థిక ప్రయోజనాలకు ఉపయోగకరమని ఎంపీ దృష్టికి బీమా ఉద్యోగులు తీసుకువచ్చారు. బీమా రంగానికి సంబంధించిన ముఖ్యమైన సమస్యలను కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎల్‌ఐసీ ఉద్యోగుల యూనియన్ మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వీవీకే సురేష్, కేజీ రమేష్, ఆర్‌వీఎస్ శ్రీనివాస్, డీ సైదులు, ఐ వెంకట్రావు, ఎస్ ప్రసాద్, పీఆర్ రాజశేఖర్, ఎం రాజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

తెనాలి-విజయవాడ రోడ్డుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

● అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మాట నిలబెట్టుకున్న లోకేశ్



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న ఆర్అండ్‌బీ సిబ్బంది

దుగ్గిరాల, జూలై 12: ఎంతోకాలంగా గుంతలమయమై వాహనదారుల ప్రయాణం నరకంగా మారిన తెనాలి-విజయవాడ మెయిన్‌రోడ్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మెయిన్‌రోడ్‌కు మరమ్మతులు చేపడతామని, రాష్ట్ర విద్య, ఐటీ, మానవనరుల శాఖామంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన నెల రోజులకే పనులు చేపట్టారు. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే మెయిన్‌రోడ్‌లో గడచిన ఐదేళ్లలో జరిగిన రోడ్డుప్రమాదాల్లో అంగవైకల్యం పొందినవారు, ప్రాణాలు కోల్పోయినవారున్నారు. దుగ్గిరాల -రేవేంద్రపాడు మధ్య పెద్ద ఎత్తున గుంతలు పూడ్చివేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం పట్ల వాహనదారులు లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

ఐఎన్‌టీయూసీ గుర్తింపు నిలుపుదల

● తెలుగునాడు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నేత భానుమూర్తి

● 'హంస' గుర్తింపుపై ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడి

గుంటూరు సిటీ, జూలై 12: ఐఎన్‌టీయూసీ గుర్తింపు నిలుపుదల చేస్తూ హెల్త్ డైరెక్టర్ పద్మావతి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారని తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మలినేని భానుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ గుర్తింపు వ్యవహారంలో తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని హెల్త్ డైరెక్టర్ ఈ ఆదేశాలు జారీచేశారని చెప్పారు. ఏ యూనియన్ గుర్తింపు వ్యవహారం అయినా రాష్ట్ర లేబర్ కమిషనర్ పరిధిలో వుంటుందని అన్నారు. ఐఎన్‌టీయూసీ గుర్తింపు వ్యవహారంలో తొలుత అధికారులు పొరబడ్డారని, తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆ విషయంపై అభ్యంతరం లేవనెత్తిన నేపథ్యంలో గుర్తింపు నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన మరో యూనియన్ 'హంస' గుర్తింపుపై కూడా త్వరలో ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. సరైన అర్హతలు లేకుండానే కొన్ని సంఘాలకు అడ్డగోలుగా గుర్తింపులు ఇచ్చారని పేర్కొన్నారు.

25,626 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 21,027 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 25,626 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 12,347 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16000	334	8500	16500
నెంబరు. 5	10500	13000	నెంబరు. 5	10500	12500
273	9000	10000	273	--	--
341	9000	14300	341	9000	15500
4884	12500	12500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	11500	11500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18500	తేజ	11500	18000
బ్యాడిగి	8000	16000	బ్యాడిగి	8500	14000
దేవనూరుడీలక్స్	9000	12500	దేవనూరుడీలక్స్	10000	10000
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	5000	10500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి న్యాయాధికారి శరత్‌కుమార్

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● న్యాయవాదులతో జిల్లా ఇన్‌చార్జి న్యాయాధికారి శరత్‌కుమార్

గురజాలటౌన్, జూలై 12: నూతన చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాని జిల్లా ఇన్‌చార్జి న్యాయాధికారి శరత్‌కుమార్ సూచించారు. పట్ట ణంలో శుక్రవారం న్యాయవాదులకు నిర్వహించిన నూతన చట్టాలపై అవగా హన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బీఎన్ఎ స్ఎస్, బీఎస్ఎస్ చట్టాలపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. కొత్త చట్టాలలోని ప్రాథమిక సూత్రాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు నూతన చట్టాలపై సీనియర్ న్యాయవాదుల ద్వారా వర్క్‌షా పులు నిర్వహించుకొని అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈసదస్సులో బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, న్యాయవాదులు హనుమంతు రావు, మందపాటి శ్రీనివాసరెడ్డి, కుమారస్వామి, నాగిరెడ్డి, వీరభద్రుడు, చల్లా రామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



భుజానికి శస్త్ర చికిత్స చేయించుకొని గుంటూరులోని తన గృహంలో విశ్రాంతి పొందు తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారా యణను శుక్రవారం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పరామర్శించారు. - సత్తెనపల్లి

తహసీల్దార్ సంతకం మళ్లీ ఫోర్జరీ

● వీఆర్ఏ కుమారుడే నిందితుడు.. పోలీసులకు ఫిర్యాదు

దాచేపల్లి, జూలై 12: రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని కొందరు వ్యక్తులు తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంపై అధికారులు, రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తన సంతకం ఫోర్జరీ అయిన విషయంపై శుక్రవారం దాచేపల్లి తహసీల్దార్ గీతావాణి విలేకరులతో మాట్లాడారు. దాచేపల్లికి చెందిన ఓ రైతు బ్యాంకు నుంచి కోసం అడంగళ్ కాపీ పొందేందుకు భూమి పత్రాలను తహసీల్దారు కార్యాలయానికి తీసుకువచ్చాడన్నారు. ఆ పత్రాలను పరిశీలించగా తన సంతకం ఫోర్జరీ చేసి నట్టుగా గుర్తించినట్లు తహసీల్దారు తెలిపారు. కొద్ది రోజుల క్రితం మాదినపా డు గ్రామానికి చెందిన రైతు భూమి పత్రాల్లోనూ తన సంతకాలు పోర్జరీకి గురైందని, మాదినపాడు వీఆర్ఏ షేక్ చిన సైదులు కుమారుడు జానీబా షాపై ఈఫోర్జరీకి పాల్పడినట్లు దాచేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పుడు దాచేపల్లి రైతు భూమి పత్రాలపై ఫోర్జరీ సంతకంపైనా పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే పోలీసులు నిందితుడిని ఇంత వరకు పట్టు కోలేదని తెలుస్తోందన్నారు. సంతకం ఫోర్జరీ విషయంపై తమతోపాటు, రైతులూ ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసు స్పందించి నిందితుడిని అరెస్ట్ చేయాలని తహసీల్దారు కోరారు.

పెదపాలెం ఎస్సీ కాలనీలో వైద్యశిబిరం

అచ్చంపేట, జూలై 12: మండలంలోని పెదపాలెం ఎస్సీ కాలనీలో శుక్ర వారం అచ్చంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వ హించారు. ఎస్సీ కాలనీలో సీజనల్ జ్వరాలు నమోదవుతున్న క్రమంలో పలు వురికి వైద్య చికిత్సలు అందించారు. అనంతరం దోమల లార్వాల నివారణ కోసం ఇంటింటికి తిరిగి గాబుల్లోను, పరిసరాల్లోని నీటి నిల్వల్లో దోమ లార్వాల నివారణ మందులు చల్లారు. అలేగే కుండల్లో నిల్వ ఉండే నీటిని అధికారులు దగ్గరుండి పార బోయించారు అనేక మందికి డాక్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పీ.వెంకటరావు, పర్యవేక్షకులు రాధాకృష్ణ, బేబీ రాణి, శివ నాగమణి, దుర్గ, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధుల నియంత్రణ

● 75 తాళ్ళూరు పీహెచ్‌సీ సీహెచ్‌వో అనుపమ

పెదకూరపాడు, జూలై 12: వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వడం ద్వారానే వ్యాధులను నియంత్రించవచ్చని 75 తాళ్ళూరు పీహెచ్‌సీ సీహెచ్‌వో మొద్దు అనుపమ అన్నారు. పెదకూరపాడు జడ్పీ హైస్కూల్లో శుక్ర వారం విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి నిల్వల్లో దోమలు చేరి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రులకు ఈ విషయాలను చెప్పి ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం కాకాని వెంకటరమణ, ఆరోగ్య కార్యకర్త రాణి, ఆషా కార్యకర్తలు షేక్ సుపియ, గోగులపాటి స్వప్న, పరిశుద్ధ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని ఆర్వో ప్లాంట్లు

అమరావతి, జులై 12: మండల పరిధిలోని గ్రామాలలో నాడు- నేడు మొదటి ఫేజ్‌లో 19 పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్లలో ఒకటి రెండు మినహా మిగిలినవి రిపేరు రావడంతో వాటిని మరమ్మతులు చేసేవారు అందుబాటులో లేక ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతు న్నారు. పాఠశాలలో విద్యార్థులకు సురక్షిత మంచినీరు అందుబాటులో లేకపోవడంతో ఇంటి వద్ద నుంచి బాటిల్స్ తెచ్చుకుంటున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. ప్లాంటు రిపేరు చేసే మెకానిక్‌కు ఫోన్ చేసినప్పటికి రాకపో వడంతో ఏమిచేయాలో తెలియని స్థితిలో ఉన్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయించి విద్యార్థులకు సురక్షిత తాగునీటిని అందించాలని కోరుతున్నారు.

మత్స్యకారుడు మృతిపై కొనసాగుతున్న విచారణ

వెల్దుర్తి, జూలై 12: మండలంలోని బంగారుపెంటకు చెందిన మత్స్యకా రుడు చౌటుపల్లి దుర్గారావు గత జనవరిలో ఆత్మహత్య చేసుకోగా, ఈ ఘటనపై పునర్ విచారణ కొనసాగుతోంది. శుక్రవారం గురజాల ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి బంగారు పెంటకు చేరుకొని దుర్గారావు భార్య ధనలక్ష్మిని విచారించారు. అనంతరం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయానికి చేరుకొని ధనలక్ష్మి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకున్నారు.

జాతీయ సెమినార్‌కు

ఓబులేశునిపల్లె ఉపాధ్యాయిని

దుర్గి, జూలై 12: అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఈనెల 15, 16 తేదీల్లో కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ సెమినార్‌కు మండలంలోని ఓబులేశునిపల్లె ఎస్‌కేఎస్ జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయిని బీటీటీ సుందరి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం హెచ్ఎం శ్రీనివా సరావు, తోటి ఉపాధ్యాయులు ఉపాధ్యాయిని సుందరిని అభినందించారు.

సబ్సిడీపై కందిపప్పు పంపిణీ

పిడుగురాళ్ల, జూలై 12: పల్నాడు జిల్లా కలెక్టర్ పీ.అరుణ్ బాబు ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో సబ్సిడీపై కందిపప్పు కౌంటర్‌ను స్థానిక తహసీల్దార్ శ్యాంసుందరరాజు, డిప్యూటీ తహసీల్దార్ సరోజలు ప్రారంభించారు. పట్టణ డాల్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు గుండా రామారావు, కట్టమూరి శంకరరావు, యేలూరి చంద్రం, దేవభక్తుని లక్ష్మణబాబు, కొత్త శివయ్య, కే.సాంబశివరావుతో పాటు మరికొందరు సభ్యులు హాజరై లబ్ధిదారులకు కందిపప్పు పంపిణీ చేశారు.

గ్రామ దేవత దేశమ్మ తల్లికి పూజలు

పెదకూరపాడు, జూలై 12 : మండలంలోని 75 తాళ్ళూరులో గ్రామ దేవత దేశమ్మ తల్లికి భక్తులు పూజలను నిర్వహించారు. శుక్రవారం జల బిందెలతో మహిళలు అభిషేకం నిర్వహించారు. 14న పొంగళ్ళు, బోనాలు నిర్వహిం చనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ట్రిపుల్ ఐటికి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

మాచవరం, జూలై 12: మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన మాచవరం గ్రామానికి చెందిన దేరంగుల యామని నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేఎస్ఎస్ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నీలం వెంకటే శ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థిని యామనికి అభినందనలు తెలిపారు.

నకరికల్లు : నూజివీడు ట్రిపుల్ ఐటీకి కండ్లకుంట జడ్పీ హైస్కూల్‌కు చెందిన మేకా దీపిక ఎంపికైనట్లు ఎంఈవో ఎంఎల్ఎన్ ప్రసాదు శుక్రవారం తెలిపారు. 10వ తరగతిలో దీపిక 581 మార్కులు సాధించినట్లు చెప్పారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

● మున్సిపల్‌శాఖ మంత్రి ఆదేశాలతో తక్షణ చర్యలు
● డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో వైద్యశిబిరాలు
● పరిశీలించిన జిల్లా వైద్యాధికారి రవి



లెనిన్‌నగర్‌లో పర్యటిస్తున్న డీఎంహెచ్ఓ రవి



వాటర్ ప్లాంట్లలో నీటి శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

పిడుగురాళ్ల, జూలై 12: పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని లెనిన్‌నగర్, మారుతీ నగర్ ప్రాంతాలలో శుక్రవారం మునిసిపల్ అధికారులు పారిశుధ్య పనులను ముమ్మ రంచేశారు. గురువారం ఆయా ప్రాంతాలలో మున్సిపల్‌శాఖ మంత్రినారాయణ పర్యటించి 24 గంటల్లో ఆయా ప్రాంతాల్లో యుద్ధప్రాతి పదికన పారిశుధ్య మెరుగు దలకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించారు. మురుగుకాల్వల్లో పేరుకు పోయిన పూడికను తొలగించి బయటప్రాంతాలకు తరలిం చారు. ఖాళీ ప్రదేశాలలో పెరిగిన ముళ్లకంపను తొలగించే ప్రక్రియ చేపట్టారు. విజయవాడ నుంచి వచ్చిన ల్యాబ్ సిబ్బంది పలు ప్రాంతా లలో నీటి శాంపిల్స్‌ను సేకరించారు. ఆయా ప్రాంతాలలో డయేరియా కేసుల పరిశీలన, పరిసరాల పరిశుభ్రత, మంచినీటి శాంపిల్స్‌కు రాష్ట్ర అకడమిక్ టీమ్ సభ్యులతో పాటు పల్నాడుజిల్లా వైద్యాధికారి రవి శుక్రవారం ఆయా ప్రాంతాలలో పర్యటించి డయే రియా అదుపునకు సిబ్బంది చేపడుతున్న చర్యలను పరిశీలిం చారు. మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, ఏఈ రాఘవేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమాదేవి, డాక్టర్లు రవితేజ, నస్రీన్, పద్మావతి, సిహెచ్ హర్షవర్ధన్, ఎంపీహెచ్ ఈవోలు సుబ్రహ్మ ణ్యం, పట్టాభి, రసూల్, సూపర్‌వైజర్, సిబ్బందితో పాటు పలువురు ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను దగ్గరుండి పర్యవేక్షించారు.



లెనిన్‌నగర్, మారుతీనగర్‌లలో మురికికాల్వల్లో పూడికను తీస్తున్న సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్లటౌన్, జూలై 12: మాచర్ల సబ్‌స్టేషన్ పరిధిలో రెంటచిం తల ఫీడర్ 33కేవీ, అగ్నిగుండాల ఫీడర్ 33 కేవీ, ఎన్ఎస్‌డ్యాం ఫీడర్ 33 కేవీ, వెల్దుర్తి 2 ఫీడర్ 33 కేవీ, అనుపు ఫీడర్ 33 కేవీ, ఉప్పల పాడు 33 కేవీ పరిధిలోని ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తు న్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామయ్య తెలిపారు. విద్యుత్ లైన్ల మెయింట్‌నెన్స్, చెట్ల కొమ్మలు తొలగింపుల, సబ్‌స్టేషన్ మెయిం ట్‌నెన్స్, రోడ్డు వైండింగ్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంత రాయం కలిగించనున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ముప్పాళ్ళ: ముప్పాళ్ళ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని 11కేవీ లైన్ మరమ్మతుల నిర్వహణ కోసం మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఏ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేయటం జరగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

సత్తెనపల్లి : పట్టణంలోని 11 కేవీ లైన్ పరిధిలో చెట్ల కటింగ్, సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ పీ.రవికిరణ్ శుక్రవారం విలేకరు లకు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

దాచేపల్లి: విద్యుత్ మరమ్మతులలో భాగంగా మండలంలో శని వారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని దాచేపల్లి విద్యుత్ రూరల్ ఏఈ బండారు నాగేశ్వరరావు తెలిపారు. వినియోగ దారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

పిడుగురాళ్ల: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శని వారం పిడుగురాళ్ల పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. కొండమోడు నుండి పట్టణం లోని జానపాడురోడ్డు వరకు ఎడమచేతి వైపు ప్రాంతాల్లో విద్యుత్ కోత విధిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పెదకూరపాడు: మండలంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యా హ్నాం 2 గంటల వరకు మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ దాసరి రామకృష్ణ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

మాచవరం: మండలంలోని అన్ని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ కే.పెదమస్తాన్ తెలిపారు. 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం గం.8.30 నుంచి మధ్యాహ్నం 2.00గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివే యనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెరుగైన పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

మాచర్ల రూరల్, జూలై 12: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పారి శుధ్యంపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని ఎంపీపీ మంగమ్మ సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాల యంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ డయేరియా, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగా హన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. పారిశుధ్య సిబ్బం ది దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరించారు. సమావేశంలో జడ్పీటీసీ మల్లుస్వామి, సుజాత కోటిరెడ్డి, ఎంపీడీవో సరోజినిదేవి, కోటేశ్వరరావు, డాక్టర్ శివలీల తదితరులు పాల్గొన్నారు.

విద్యా కిట్లు పంపిణీ

గురజాలటౌన్, జూలై 12: గురజాల నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం విద్యార్థు లకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మాజీ సర్పంచ్ పున్నారెడ్డి, యెనుముల మల్లారెడ్డి, అంజిరెడ్డి, నారాయణ, నాసర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ సీఐగా ఏడుకొండలు

పిడుగురాళ్ల, జూలై 12: పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ సీఐగా కే. ఏడు కొండలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని రైల్వే విభాగంలో పనిచేస్తున్న ఏడుకొండలు బదిలీపై పిడుగురాళ్లకు వచ్చారు. రైల్వేస్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సీఐ ఏడు కొండలు తెలిపారు.

నాగార్జున యాదవ్‌పై ఫిర్యాదు

రాజుపాలెం, జూలై 12 : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై ఓచానల్లో అనుచిత వ్యాఖ్యలుచేసిన నాగార్జున యాదవ్ పై నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు చిన్నబోయిన రాఘవ యాదవ్ శుక్రవారం రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఎం చంద్రబాబునాయుడుని అలిపిరి ఘటన విషయంలో ఆ వెంక టేశ్వరస్వామి కాపాడాడు అని, చంద్రబాబునాయుడను ఉరితీయా లని పలు సందర్భాల్లో నాగార్జున యాదవ్ అనుచిత వ్యాఖ్యలు చేశాడని, అతనిపై కేసు నమోదు చేసి, శిక్ష పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నేతలు సఖినాల వలరాజు, గోరంట్ల కోటేశ్వరరావు, ఆలా రామయ్య, నల్లగొర్ల శరత్, ఆరుద్ర ఆదయ్య, ఆలా వెంకయ్య, తుమాటి కోటయ్య, సైదులు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో సోషల్ ఆడిట్ బృందం తనిఖీ

ముప్పాళ్ళ, జూలై 12 : మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకం కింద 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను చేపట్టిన పనులకు సంబందించి సామాజిక తనిఖీ బృందం శుక్ర వారం తనిఖీ చేపట్టింది. మండలంలో ఉపాధిహామీ పథకం పను లతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్, పశుసంవర్ధక, గృహనిర్మాణ, పంచాయతీ రాజ్ శాఖల్లో చేపట్టిన పనులను తనిఖీ చేయనున్నారు. 2023 -24 సంవత్సరంలో ఉపాధిహామీ పథకం ద్వారా 403 పనులకు సంబం దించి రూ.5,20,23,141 ఖర్చు చేయటం జరిగిందని, వీటిపై తనిఖీ చేయనున్నట్లు బృంద సభ్యులు తెలిపారు.

వీఆర్‌కు పిడుగురాళ్ల సీఐ

పిడుగురాళ్ల, జూలై 12: పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్ సీఐగా పని చేస్తున్న పీవీ ఆంజనేయులను పోలీసులు ఉన్నతాధికారులు శుక్ర వారం వీఆర్‌కు బదిలీ చేశారు. పీవీ ఆంజనేయులు రెండేళ్లుగా పిడుగురాళ్ల పట్టణసీఐగా విధులు నిర్వహించారు. ఆయన స్థానంలో గుంటూరులో పనిచేస్తున్న వెంకట్రావును పిడుగురాళ్ల సీఐగా నియ మిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

ఘర్షణలో రాజకీయ కోణం లేదు

వెల్దుర్తి, జూలై 12: రెండు రోజుల క్రితం మండలంలోని శ్రీరాంపు రంతండాలో జరిగిన ఘర్షణలో ఎటువంటి రాజకీయ కోణం లేదని మాచర్లరూరల్ సీఐ సురేష్ తెలిపారు. శుక్రవారం వెల్దుర్తి పోలీసుస్టే షన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కే తావత్ హనుమంతు నాయక్, పాత్లావత్ అంజి నాయక్‌లకు ఓ స్థలం విషయంలో చాలా ఏళ్లుగా వివాదం నడుస్తోందని, ఈ విష యంలోనే మాటామాటా పెరిగి ఇద్దరి మధ్య ఘర్షణ పడగా, పర స్పరం ఫిర్యాదులు చేసుకున్నట్లు తెలిపారు.



ఆర్టీసీ బస్సు దిగువ భాగం నుంచి వస్తున్న పొగ

ఆర్టీసీ బస్సు నుంచి పొగలు

● డ్రైవరు అప్రమత్తతో తప్పిన ప్రమాదం

అమరావతి, జూలై 12: గుంటూరు నుంచి క్రోసూరు వెళ్తున్న ఏపీ7జడ్ 0318 ఆర్టీసీ బస్సు శుక్రవారం ఉదయం అమరావతి సమీపంలోకి రాగానే బస్సు కింద భాగం నుంచి పొగలు వచ్చాయి. గమనించిన ప్రయాణికులు వెంటనే బస్సును నిలుపుదల చేసి కిందికి దిగారు. వెంటనే పొగలు వచ్చే ప్రాంతంలో నీరు పోసి పొగలు రాకుండా ఆపారు. బస్సు వెనుక టైర్లు డ్రమ్ములలో రాపిడి జరిగి, దానికివున్న గ్రీజు అంటుకోవడంతో పొగలు వచ్చినట్లు డ్రైవరు తెలిపారు. పొగలు గమనించకుండా వాహనాన్ని పోనిచ్చి నట్లైతే బస్సు దగ్ధమై ఉండేదని, డ్రైవర్ అప్రమత్తతో ప్రమాదంతప్పిం దని ప్రయాణికులు తెలిపారు.

ఆర్వో ప్లాంట్లు.. అలంకారప్రాయమేనా?

● పాఠశాలల్లో పనిచేయని రక్షిత తాగునీటి పథకం
● నిర్వహణను గాలికొదిలేసిన గత ప్రభుత్వం
● రూ.లక్షల ప్రజాధనం నిరుపయోగమేనా ?



బృగుబండ హైస్కూల్లో పని చేయని ఆర్వో ప్లాంటు

సత్తెనపల్లి, జూలై 12 : నాడు- నేడు పథకం పనుల్లో భాగంగా గత ప్రభుత్వం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్లు నేడు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్లు విద్యార్థులకు రక్షిత నీటిని అందించలేక పోతున్నాయి. కొన్ని పాఠశాలలకు ప్లాంటు పరికరాలు పాఠశాలలకు పంపి అధికారులు చేతులు దులుపుకోగా, మరికొన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ లోపంతో మరమ్మతులకు గురై ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఇళ్ళ నుంచే సీసాలలో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. లక్షల రూపాయాల ప్రజా ధనం ధారపోసి పోసి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్లు నేడు నిరుపయోగంగా మారాయి.



సత్తెనపల్లి పట్టణంలోని సుగాలీ కాలనీ హైస్కూల్లో పని చేయని ఆర్వో ప్లాంట్

మండలంలోని బృగుబండ ఎల్ఈ, కందులవారిపాలెం, రెంటపాళ్ళ హెచ్ఈ, భీమవరం, కంటెపూడి, గార్లపాడు, బృగుబండ, సత్తెనపల్లి, నందిగామ, రామకృష్ణాపురం, ఎల్ గార్లపాడు హైస్కూళ్లలోని ఆర్వో ప్లాంట్లు పూర్తిగా పని చేయటం లేదు. దీనిపై సంబంధిత అధికా రులు దృష్టి సారించి, పనిచేయని ఆర్‌వో ప్లాంట్లకు మరమ్మతులు నిర్వహించాలని, పరికరాలు ఉన్న పాఠశాల్లో ప్లాంటును ఏర్పాటు చేయాలని, విద్యార్థులు పాఠశాలలోనే రక్షిత తాగునీటిని అందిం చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే ప్రవీణ్



మంత్రి అచ్చెన్నాయుడితో భాష్యం ప్రవీణ్



మంత్రి గొట్టిపాటి రవితో భాష్యం ప్రవీణ్

క్రోసూరు,/ పెదకూరపాడు జూలై 12: రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌ను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పెదకూరపాడు ని యోజకవర్గ మండలాల్లో నెలకొ న్న విద్యుత్ సమస్యల పరిష్కా రానికి సహకారం అందించా లని మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌ను ఎమ్మెల్యే ప్రవీణ్ తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చం నాయుడును ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మర్యాద పూర్వకంగా కలసి దుశ్శాలువాతో సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో వారాహిదేవికి పూజలు

దాచేపల్లి, జూలై 12: వారాహిదేవి నవరాత్రులలో భాగంగా దాచేపల్లిలోని వీర్ల అంకమ్మతల్లి దేవాలయంలో వారాహిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తు న్నారు. గత ఐదురోజులుగా అమ్మవారిని వారాహిదేవిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. లలితాపారాయణం, కుంకుమార్చనలు చేపట్టారు.వాసవి కన్యకాపరమేశ్వరి, వెంకటేశ్వర మహిళా మండలి, అంకమ్మ తల్లి భక్త సమాజం ఆధ్వర్యంలో అమ్మవారిని రోజుకొక రూపంలో అలంకరణ చేస్తున్నారు. సాయంత్రం 6 గంటల నుండి 9 గంటల వరకు అమ్మవారికి జరిగే పూజా కార్యక్రమాలు తిలకించేందుకు ప్రజలు విశేషంగా తరలి వస్తు న్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మండాది పవన్ కుమార్‌శర్మ వేదపఠనం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నరేష్ భక్తులకు ఏర్పాట్లు చేశారు.

నకరికల్లు: మండలంలోని కుంకలగుంట గ్రామంలో వేంచేసివున్న భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్ర స్వామి దేవాలయంలో వారాహిదేవి నవరాత్రులు కొనసాగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా 7వరోజు శుక్రవారం వజ్రవారాహి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు. స్వామి వారికి విశేష అభిషే కాలు, కుంకుమ పూజలను ఆలయ అర్చక స్వామి మామిళ్ళపల్లి విశ్వనాథ శాస్త్రి నిర్వహించారు. పూజల్లో భద్రకాళి అమ్మవారి దేవాలయ ధర్మకర్త జమ్ముల వెంకటేశ్వర్లు శ్రీదేవి దంపతులు, తెలగనేని సీతారామయ్య వరలక్ష్మి దంపతులు, సింగరాజు పూర్ణ దంపతులు, కిష్టంశెట్టి చిన్న దంపతులు పాల్గొ న్నారు. ఎంవీ ఇన్‌స్పెక్టర్ ప్రసన్నస్వామి వారిని దర్శించుకున్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన

నకరికల్లు, జూలై 12: బాల్య వివాహాల అనర్థాలపై చిన్నారుల తల్లిదండ్రు లకు అంగన్‌వాడీ కార్యకర్తలంతా అవగాహన కల్పించాలని సత్తెనపల్లి సీడీపీవో టీ.శ్రీలత సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో భారతీయ న్యాయ సంహిత కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో సీడీపీవో శ్రీలత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే తల్లులకు, బాలికలపై జరిగే అఘాయిత్యాలను నిరోధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియ జేయాలన్నారు. బాల్య వివాహాల వలన జరిగే కష్ట నష్టాలను సమగ్రంగా తెలియ జేయాలని తెలిపారు. అంగన్ వాడీ కేంద్రాల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయమణి, ఏసీడీ పీవో సంతోష కుమారి, సూపర్‌వైజర్లు నాగమణి, రమిజున్, ఆనంద కుమారి, అంగన్ వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని ప్రారంభించాలి

రెంటచింతల,జూలై 12: బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని కూటమి ప్రభుత్వం పునః ప్రారంభించాలని టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి రవి శుక్రవారం ఒక ప్రకటనలో కూటమి ప్రభుత్వాన్ని కోరారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ఈ పథకాన్ని అమలు చేయగా అనంతరం వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని అమలు చేస్తే పేద, మధ్య తరగతి విద్యా ర్థులకు ఎంతో ప్రయోజనం వుంటుందని రవి తెలిపారు.

మహిళ హత్యపై విచారణ

రెంటచింతల, జూలై 12 : మండలంలోని తుమ్మకోట గ్రామానికి చెందిన ఓ మహిళ హత్య కేసుకు సంబంధించి కారంపూడి సీఐ అళహరి శ్రీనివాస్ శుక్రవారం పలువురిని విచారించారు. కుంకులగుట్ల భారతి(40) నరసరావు పేట నుంచి తన స్వగ్రామమైన తుమ్మకోటలో జరిగే వినాయకుడి విగ్రహ ప్ర తిష్ఠ మహోత్సవానికి ఏప్రిల్ 21న హాజరుకాగా, 22 వేకువ జామున హత్యకు గురైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా హత్యకు గురైన భారతి కుటుంబీకు లను, బంధువులను ఇరుగు పొరుగు వారిని సీఐ, ఎస్ఐ ఆంజనేయులు వి చారించారు. అత్త ఇంటికి వచ్చిన భారతి ఎందుకు హత్యకు గురైంది? అందు కు గల కారణాలేంటనే అంశాలపై పోలీసులు ఆరా తీశారు.


అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● మండల పరిషత్ సమావేశంలో ఎంపీడీవో వెల్లడి

క్రోసూరు, జూలై 12: క్రోసూరు మండల పరిషత్ జనరల్ బాడీ సమావేశం శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఎంపీపీ పెరుమాళ్ళ పల్లి కోటయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై ఎంపీడీవో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్యం, వ్యవసాయ శాఖలకు సంబంధించి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కేవీ రమణ సూచించారు. వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్ మాట్లాడుతూ మండలంలో సబ్సిడీపై పచ్చి రొట్టె విత్తనాలు, ఎరువులు పంపి ణీకి సిద్ధం చేశామన్నారు. గ్రామాల్లో సభలు నిర్వహించి కౌలు రైతులను గుర్తించటమే కాక రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ వారికి గుర్తింపు కార్డులను ఇప్పించే కార్యక్రమం చేపట్టామన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇన్నారావు మాట్లాడుతూ మండలంలోని సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలను అప్రమత్తంగా చేస్తున్నామన్నారు. తహసీల్దార్ సుగుణ మాట్లా డుతూ మండలంలో వ్యవసాయ శాఖను సమన్వయం చేసుకుంటూ కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. రెవెన్యూ సంబందిత సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరం

క్రోసూరు, జూలై 12 : మైనార్టీ తీరని పిల్లలు వాహనాల డ్రైవింగ్ చేస్తే చట్టరీత్యా నేరమని ట్రాన్స్‌పోర్టు అధికారి రాంబాబు తెలిపారు. శుక్రవారం సాయంత్రం క్రోసూరులో ప్రమాదాల నివారణ, హెల్మెట్ ధరిం చటం అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి ప్యానల్ న్యాయవాది ఆకుల నాగార్జున అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మోటారు వెహికల్ చట్టం 1988 గురించి వివరించారు. ప్యానల్ న్యాయవాది ఆకుల నాగార్జున మా ట్లాడుతూ ప్రతి రోజు నూతనంగా మూడు వేల వాహనాలు మన దేశంలో వాడుకలోకి వస్తున్నాయని, రోడ్డు భద్రతను పాటించ కుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. మైనర్ డ్రైవింగ్ అధిక ప్రమాదమన్న విషయాన్ని పౌరులందరూ గుర్తించాల న్నారు. లైసెన్స్ లేకుండా ప్రయాణించటం, వాహనాలకు అధిక లోడు నింపటం మొదలైన విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో క్రోసూరు ఎస్ఐ షేక్ షఫీ, పారా లీగల్ వాలంటీర్లు షేక్ ఖాజావలి, షేక్ ముబారక్, కానిస్టేబుల్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌పోర్టు అధికారి రాంబాబు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



వినియోగదారులకు ప్రత్యేక కౌంటర్‌లో కందిపప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నిత్యావసరాల కోసం ప్రత్యేక కౌంటర్లు

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 12: ప్రజలకు నిత్యావసర వస్తువులు అందుబాటులోకి తీసుకురావడానికే ప్రభుత్వం తరపున ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణం శివుడు బొమ్మ సెంటర్‌లో పౌరసరఫరాల శాఖ, రైస్ అండ్ దాల్ మిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బియ్యం, కందిపప్పు ప్రత్యేక కౌంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు వనమా శివ, జనరల్ సెక్రటరీ పచ్చిపులుసు సతీష్‌కుమార్, కోశాధికారి దేసు శ్రీనివాసరావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వీరమళ్ళ వెంకటేశ్వరరావు, రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, రైస్ అండ్ దాల్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఊరా భాష్కరరావు, గుట్టుపల్లి సత్యనారాయణ, చలవాది బ్రహ్మయ్య అత్తులూరి సుబ్బారావు, శిఖాకొల్లి సూర్యనారాయణ, ఆర్డీవో పీ సరోజిని, డీఎస్‌వో పద్మశ్రీ, కొండారెడ్డి, తహసీల్దార్ నాయక్, వాసిరెడ్డి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

డిగ్రీ ఫలితాలలో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, జూలై 12: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విడుదల చేసిన నాలుగవ సెమిష్టర్ డిగ్రీ ఫలితాలలో కృష్ణవేణి డిగ్రీ విద్యార్థులు ప్రతిభచాటారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. బీఎస్సీ ఎంఎస్‌సీఎస్‌లో పీ పద్మలీలా 873/900, ఎంపీసీఎస్‌లో కే వెంకటలక్ష్మి 872/900, ఎంబీసీసీఎస్‌లో ఎస్‌కే మున్ని 964/1000, ఎంసీసీఎస్‌లో జీ శైలజ 836/900, ఎంఈసీఎస్‌లో వై నాగలక్ష్మి 830/900, బీజెడ్‌సీలో ఎం సౌజన్య 921/1000, బీకామ్ కంప్యూటర్‌లో బీ జ్యోతి 734/800 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను కళాశాల అకడమిక్ డైరెక్టర్ డీ యోగేశ్వరరావు, ఎస్‌డీ సర్దార్ జానీహుస్సేన్, జే మల్లారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

.. వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, జూలై 12: ఏఎన్‌యూ ప్రకటించిన డిగ్రీ ఫలితాలలో వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఎంపీసీఎస్ విభాగంలో ఏ కోటేశ్వరమ్మ 867/900 ఎస్‌కే మాలిన్ 865/900, బీ ప్రవల్లిక 862/900, ఎంఎస్‌సీఎస్ విభాగంలో పీ ప్రవల్లిక 850/900, జీ హరివెంకటనాగ సుస్మిత 839/900, బీ స్రవంతి 830/900, బీకామ్‌లో ఎం.అంజలి 727/800, ఎం.త్రివేణి 711/800, ఎస్‌కే జానీభాషా 709/800, మార్కులు సాధించారన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కె.రామకోటేశ్వరరావు, ఓ.నాగేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, ఎస్.సురేష్‌బాబు, అధ్యాపకులు, సిబ్బంది అభినందిచారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసరావుపేట రూరల్, జూలై 12: మండలంలోని జొన్నలగడ్డలోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్‌లైన్ల వెంబడి చెట్ల తొలగింపు కార్యక్రమం నేపథ్యంలో నేడు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. నరసరావుపేట పట్టణంతోపాటు, నరసరావుపేట మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

● రొంపిచర్ల, జూలై 12: మండలంలోని రొంపిచర్ల, మర్రిచెట్టుపాలెం, బుచ్చిబాపన్నపాలెం, సుబ్బయ్యపాలెం గ్రామాల్లోని సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఏఈ రాంబాబు శుక్రవారం తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. మూడోఫేజ్ కరెంట్‌ను శనివారం తెల్లవారుజామున 12గంటల నుంచి 9గంటల వరకు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఐదుగురు విద్యార్థుల ఎంపిక

రొంపిచర్ల, జూలై 12: మండలంలోని రెడ్డిపాలెం ఏపీ మోడల్ పాఠశాల, జడ్పీ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ఎంఈవో బ్రహ్మేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ముగ్గురు విద్యార్థులు నూజివీడు, మరొకరు శ్రీకాకుళం, ఒకరు ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లకు ఎంపికయ్యారన్నారు. డీ దీపిక, ఎం భవ్యశ్రీ, పీ వెంకట అవినాష్‌లు ఏపీ మోడల్ పాఠశాలల నుంచి, షేక్ అయాష పర్వీన్, బాణావత్ అనీల్ నాయక్‌లు రెడ్డిపాలెం జడ్పీ పాఠశాల నుంచి ఎంపికయ్యారన్నారు. వీరిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రవి నాయక్, కట్టా అంజనేయులు, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు అభినందించారు.

ఏపీ మోడల్ పాఠశాలలో మొక్కలు నాటిన విద్యార్థులు

రొంపిచర్ల, జూలై 12: మండలంలోని రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో శుక్రవారం అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ బీ రవి నాయక్ మాట్లాడుతూ మొక్కలను నాటడం ద్వారా పర్యావరణం పరిరక్షించు కోవచ్చన్నారు. తల్లి పేరుతో మొక్క నాటడం తల్లిని గౌరవించట మవుతుందన్నారు. మొక్కలు పెంపకం ద్వారా వర్షాలు సకాలంలో కురుస్తాన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో కవితాచౌదరి, ఇతర అధికారులు

సామాజిక తనిఖీలను పారదర్శకంగా నిర్వహించాలి

● ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి

శావల్యాపురం, జూలై 12: మండలంలోని 15గ్రామ పంచాయతీలలో గత ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన అభివృద్ధి పనులపై శనివారం ప్రారంభం కానున్న సామాజిక తనిఖీలను అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి అన్నారు. 17వ విడత సామాజిక తనిఖీల నిర్వహణపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమన్వయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎస్‌ఆర్పీ జేఎస్ రాజు మాట్లాడుతూ 2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31వరకు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధిహామీ శాఖల పరిధిలో నిర్వహించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సచివాలయ, ఆర్బీకే, హెల్త్‌క్లినిక్ భవన నిర్మాణాలు, పాఠశాలల్లో నాడు-నేడు పనులు, పింఛన్లు, కూలీల మస్టర్లు తదితర అంశాలను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండల వ్యాప్తంగా రూ.5.84కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించారన్నారు. అభివృద్ధి పనులపై పూర్తిస్థాయి రికార్డులను అధికారులకు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో కటారపు రామారావు, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించాలి: ఎంఈవో

శావల్యాపురం, జూలై 12: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ బోధనను అందించి వారిలో సామర్థ్యాలను పెంపొందింపజేయాలని మండల విద్యాశాఖాధికారి మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. మండలంలోని చిన్నకంచెర్ల, పిచికలపాలెం ప్రాథమిక పాఠశాలలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాలలలోని రికార్డులు, విద్యార్థులలోని సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం, పరిసరాల పరిశుభ్రత, బోధన ప్రణాళిక, స్కూల్‌కిట్స్ పంపిణీ తదితర అంశాలు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. హెచ్‌ఎంలు మురుగుల శ్రీనివాసరావు, తాత మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి, బాబు, మున్నయ్య, ఫణికుమారి తదితరులు పాల్గొన్నారు.

17న జరిగే తిరునాళ్లకు ఏర్పాట్లు చేయండి

● సమీక్షలో అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, పక్కన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, సమావేశానికి హాజరైన అధికారులు, సేవా సంస్థ ప్రతినిధులు

వినుకొండ, జూలై 12: ఈ నెల 17న తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా వినుకొండలోని శ్రీరామలింగేశ్వర స్వామి కొండమీద జరిగే తిరునాళ్లను విజయవంతం చేసేందుకు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని పల్నాడు కలెక్టర్ అరుణబాబు ఆదేశించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం ఆవరణలో కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ముందుగా దేవదాయ, పంచాయతీ రాజ్, పోలీస్, మున్సిపాల్టీ, ఆర్‌అండ్‌బీ, వైద్య, విద్యుత్ తదితర శాఖ అధికారులతో సమీక్షించి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణబాబు మాట్లాడుతూ శ్రీరామలింగేశ్వరస్వామి తిరునాళ్లకు లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు గురికాకుండా, అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తొలిఏకాదశి పండుగ వినుకొండ తిరునాళ్లను విజయవంతం చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలిగించకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీరు, అన్నప్రసాదాలు ఏర్పాటుచేయాలని, ఘాట్ రోడ్డులో వాహన రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలానే మొహరం, తొలి ఏకాదశి పండుగ ఒకేరోజు వచ్చాయని హిందూ, ముస్లింలు సమన్వయంగా పండుగలు జరుపుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దస్తగిరి, ఆర్‌డీవో సరోజిని, దేవదాయశాఖ ఏసీ సత్యనారాయణరెడ్డి, జిల్లా వైద్యాధికారి రవికుమార్, కమిషనర్ తోట కృష్ణవేణి, సీఐ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

బడి మానివేసిన పిల్లలను గుర్తించాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర సభ్యురాలు పద్మావతి



వినుకొండ కస్తూర్బా గాంధీ పాఠశాలను తనిఖీచేస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి

వినుకొండ జూలై 3: బడి మానివేసిన పిల్లల జాబితా గుర్తించటం, బాల్య వివాహాల నిర్మూలన అంశాలను క్షేత్రస్థాయిలోని సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ సభ్యులు బత్తుల పద్మావతి తెలిపారు. పట్టణంలోని అంగన్‌వాడీ, కస్తూర్బాగాంధీ పాఠశాలలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిషత్, కస్తూర్బా పాఠశాలల్లో బడి మానివేసిన విద్యార్థులను గుర్తించాలని, క్షేత్రస్థాయిలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విద్యార్థులను పాఠశాలలకు తీసుకురావాలని చెప్పారు. పిల్లలు మంచి, చెడులను గుర్తించి, ఇరుగుపొరుగు వారితో జాగ్రత్తగా నడుచుకోవాలన్నారు. అదేవిధంగా పలు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సాధికారత అధికారి కె.ఉమారాణి, ప్రాజెక్టు అధికారి ఎం.అనురాధ, సూపర్‌వైజర్లు, ఎంఎస్‌కేలు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

పోట్లూరు (శావల్యాపురం) జూలై 12: భారత రాజ్యాంగంలో బాలలకు కల్పించబడిన హక్కులకు భంగం వాటిల్లకుండా పరిరక్షించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, బాలల హక్కులకు విఘాతం కల్పించిన వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. శావల్యాపురం మండలం పోట్లూరులోని జడ్పీ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాలను స్త్రీ, శిశు సంక్షేమశాఖ పీడీ ఉమాదేవితో కలసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు స్వయంగా వడ్డించి వంటకాల నాణ్యతను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో బియ్యం, పప్పు, నూనె, కోడిగుడ్లు తదితర సామగ్రి నాణ్యతను పరిశీలించారు. ప్రీస్కూల్ విద్యార్థులకు ప్రభుత్వమందించిన ఆటసామగ్రిని పరిశీలించి విద్యార్థులతో ఆటలాడించారు. బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అన్ని పాఠశాలల్లో చైల్డ్‌హెల్ప్‌లైన్ నెంబర్, ఫిర్యాదుల బాక్స్‌ను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలన్నారు. సీడీపీవో ముదివర్తి అనూరాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత, హెచ్‌ఎం సింగంశెట్టి అన్నపూర్ణమ్మ, అంగనవాడీ టీచర్లు విజయలక్ష్మి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



పోట్లూరులో కోడిగుడ్ల నాణ్యతను పరిశీలిస్తున్న పద్మావతి

కళాశాలలకు ఇంటర్ విద్యార్థుల లాంగ్ మెమోలు

● డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నీలావతిదేవి

నరసరావుపేట టౌన్, జూలై 12: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థుల లాంగ్ మెమోలు కళాశాలలకు పంపించటం జరిగిందని డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎం.నీలావతిదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ, ఏపీఎస్ డబ్ల్యూఆర్‌జేసీ, ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో చదివి 2024 మార్చి, సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థుల లాంగ్ మెమోలు అన్ని జూనియర్ కళాశాలలకు పంపిచామన్నారు. విద్యార్థుల తమ కళాశాలలకు వెళ్ళి మార్కుల జాబితాలు తీసుకోవాలన్నారు.



సుబ్బరాయశ్రేష్టి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నాగసరపు సుబ్బరాయశ్రేష్టికి ఘన నివాళి

నరసరావుపేట టౌన్, జూలై 12: ఎస్ఎస్ఎన్ కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి, కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయశ్రేష్టి 67వ వర్ధంతిని కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సుబ్బరాయశ్రేష్టి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, కరస్పాండెంట్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, వైస్ ప్రెసిడెంట్ పెనుగొండ వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు బొలిశెట్టి రామమోహనరావు, కూనిశెట్టి లక్ష్మయ్య, వక్కలగడ్డ కోటేశ్వరరావు, బత్తుల మురళి, తాడేపల్లి భావన్నారాయణ, తటపర్తి వెంకటేశ్వరరావు, నాగసరపు రాందేవ్ గుప్తా, ప్రిన్స్‌పాల్ ఎస్.మల్లయ్య, అధ్యాపులు, సిబ్బంది పాల్గొని నివాళి అర్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జేసీ నాయుడు

ఐఎంఏ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నరసరావుపేట లీగల్, జూలై 12: నరసరావుపేట ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం పట్టణంలోని పెదచెరువులోని ఐఎంఏ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా డాక్టర్ నాగోతు ప్రకాష్, కార్యదర్శిగా డాక్టర్ పాలూరి శ్రీనివాసరెడ్డిలు బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథులుగా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జేసీ నాయుడు, కార్యదర్శి డాక్టర్ ఫణీందర్, ఆర్థిక కార్యదర్శి డాక్టర్ రవీంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ తమ అసోసియేషన్ త్వరలో నూరు సంవత్సరాలు పూర్తి చేసుకోబోతుందన్నారు. దేశంలోనే అతిపెద్ద అసోసియేషన్ అన్నారు. నాలుగు లక్షల మంది సభ్యత్వం కలిగి ఉన్నారన్నారు. ప్రాణాలను కాపాడాలనే సదుద్దేశంతో వైద్యులు అంకిత భావంతో సేవలందిస్తారన్నారు. ఇటీవల మారిన పరిస్థితుల నేపథ్యంలో వైద్యులు రోగులకు సేవలు అందించటం కంటే అనుమతులు సాధించుకోవటం, రికార్డులను తయారుచేయటం వంటి విధాన పరమైన అంశాలకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుందన్నారు. రిజిస్ట్రేషన్ విధానంలో 20అనుమతులు పొందాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఈ నిబంధనలను సరళీకృతం చేయాలని కోరారు. వైద్యులకు, రోగికి మధ్య సత్సంబంధాలు ఉండేలా నిబంధనలను సరళీకృతం చేయాలన్నారు.

కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు డాక్టర్ రామలింగారెడ్డి, వైద్యులు గజ్జల బ్రహ్మరెడ్డి, డాక్టర్ సత్రం రామ్ ప్రసాదు, డాక్టర్ వరబాబు, డాక్టర్ రామ్మోహనరావు, డాక్టర్ కృష్ణకాంత్, డాక్టర్ నజీర్, డాక్టర్ నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సఫరా నిలిపివేత

వినుకొండ టౌన్, జూలై 12: వినుకొండ 33 సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వినుకొండ టౌన్ ఎస్ఎస్ 1, 2, 3 పరిధిలో విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ జిల్లా స్థాయి సమావేశం

నరసరావుపేట టౌన్, జూలై 12: విద్యార్థులను సరైన దిశలో, సేవా మార్గంలో నిరంతరం నడిపించే ఒక అత్యున్నత సంస్థ భారత్ సౌట్స్ అండ్ గైడ్స్ అని డీఈవో కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ కేఎంఏ హుస్సేన్ అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని పల్నాడు జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయంలో జిల్లాస్థాయి ఎగ్జిక్యూటివ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కేఎంఏ హుస్సేన్ మాట్లాడుతూ అన్ని పాఠశాలలో విధిగా భారత సౌట్స్ అండ్ గైడ్స్ వింగ్స్ ప్రారంభించాలన్నారు. అనంతరం ట్రిబుల్ ఐటీ ప్రవేశాలలో భారత్ సౌట్స్ అండ్ గైడ్స్ కోటా కింది విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. సమావేశానికి స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ వీ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో స్కౌట్స్ విభాగంలో డిస్ట్రిక్ట్ సెక్రటరీ నాగేశ్వరరావు, రాంబాబు, వెంకటరెడ్డి, కృష్ణయ్య, జవహర్, టీ శ్రీనివాసరావు, యు పద్మావతి, టీ అంజిరెడ్డి, స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.



గుమ్మనంపాడులో శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న కంటి పరీక్షలు

గ్రామాల్లో కంటి వైద్య శిబిరాలు

బొల్లాపల్లి, జూలై 12: మండలంలోని గరికపాడు, పమిడిపాడు, మేళ్ళవాగు, జయంతిరామపురం, రెడ్డిపాలెం, గుమ్మనంపాడు, రేమిడిచర్ల గ్రామాల్లో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్థాపించిన శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆస్పత్రి పెదకాకాని, జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి సహకారంతో ఈ నెల 14వ తేదీన వినుకొండ పట్టణంలో నిర్వహించనున్న ఉచిత కంటి మెగా వైద్య పరీక్షల్లో భాగంగా గ్రామాల్లో 735మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 256మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. వీరందరినీ ఈ నెల 14వ తేదీ ఆదివారం వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి విడతల వారీగా శంకర్ కంటి ఆస్పత్రి పెదకాకానికి పంపి ఆపరేషన్ చేయించటం జరుగుతుందని ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ జీవీ రమణారావు తెలిపారు. కార్యక్రమంలో శంకర్ హాస్పటల్ సిబ్బంది నాగబాబు, రాజు, రాంబాబు, కైలాష్, టీడీపీ నాయకులు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ

రొంపిచర్ల, జూలై 12: మండలంలోని కొత్తపల్లి జడ్పీ పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శుక్రవారం నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు బాగా చదువుకొని రాణించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పులుకూరి జగ్గయ్య, గాడిపర్తి సురేష్, మొండితోక రామారావు, ఇమ్మడిశెట్టి కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలల్లో అవగాహన సదస్సు

నరసరావుపేట రూరల్, జూలై 12: స్థానిక తిరుమల, నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలల్లో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు (ట్రాన్స్ ఫామింగ్ ఇండియన్స్ టు ట్రాన్స్‌ఫాయ్ ఇండియా'. అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో చిన్మయ మిషన్ ప్రెసిడెంట్ స్వామి తరియానంద పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, జూలై 12: చిలకలూరిపేట పట్టణంలో, మండలంలో, యడ్లపాడు మండలంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ డీఈఈ ఆర్.అశోక్ కుమార్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని మద్దినగర్, రహమ్మత్‌నగర్, జాగుపాలెం, బొందిలిపాలెం, పాటిమీద, ప్రభుత్వ ఆస్పత్రి, సుగాలీ కాలనీ, సాంబశివనగర్, పండరీపురం, తొమ్మిది, పది లైన్‌ల పరిధిలో, చిలకలూరిపేట మండలంలో మురికిపూడి, ఎడవల్లి, కట్టుబడివారిపాలెం, మద్దిరాల, పసుమర్రు, పోతవరం ప్రాంతాల్లో, యడ్లపాడు మండలంలోని లింగారావుపాలెం, సొలస, కొండవీడు, పుట్టకోట, యడ్లపాడు, వంకాయలపాడు ప్రాంతాల్లో కూడా సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.



నలగార్లపాడులో చెరువుకట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

చెరువుకు మరమ్మతులు నిర్వహించాలి: డాక్టర్ అరవిందబాబు

రొంపిచర్ల, జూలై 12: తాగునీటి చెరువు ఇలా ఉంటే ఎలా అని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని నలగార్లపాడు రక్షిత మంచి నీటి పథకం చెరువు, ట్యాంక్‌లను శుక్రవారం పరిశీలించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. చెరువు కట్ట, చెరువులో పిచ్చి చెట్లు, తూటుకాడ పెరిగిపోయిందన్నారు. మంచి నీటి చెరువు ఆక్రమణలపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును ప్రశ్నించారు. చెరువును ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డంపింగ్ యార్డులో వేయాల్సిన చెత్తను శ్మశాన వాటికలో వేయటంపై ప్రశ్నించారు. మంచి నీటి ట్యాంకులను తక్షణమే బాగు చేయించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఝాన్సీదయాసాగర్

సర్వసభ్య సమావేశంలో సమస్యల ఏకరువు

యడ్లపాడు, జూలై 12: యడ్లపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఝాన్సీదయాసాగర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన సమావేశంలో సభ్యులు గ్రామల్లో నెలకొన్న సమస్యలను ఏకరువు పెట్టారు. తాగునీరు, విద్యుత్, వ్యవసాయం, ఆరోగ్యం తదితర అంశాలపై వాడివేడిగా చర్చసాగింది. కోట గ్రామ సర్పంచ్ హఫీజ్‌బేగ్ ప్రతి సమావేశంలో సమస్యలు చెప్పుకోవడమే కాని పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. సొలస ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సచివాలయాలలో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని, 11 గంటలు దాటినా కార్యాలయాలకు రావడం లేదన్నారు. యడ్లపాడు ఎంపీటీసీ అరుణ్, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి పలు సమస్యలను ప్రస్తావించారు. ఎంపీపీ ఝాన్సీదయాసాగర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బందిపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ ఆషివున్నీసాబేగం, ఈవోపీఆర్డీ వరూధిని, వివిధశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వీ విజయ కుమార్

బొల్లాపల్లి, జూలై 12: స్థానిక మండల కేంద్రమైన ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీడీవో వీ విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండలంలోని పలుకూరు తండా, జయంతిరామాపురం గ్రామాల్లో మట్టిరోడ్లు వేయటం జరిగిందని, వాటికి ఇంతవరకు బిల్లులు ఇవ్వకుండా ఉపాధి సిబ్బంది ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అలాగే కొన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల బిల్లులు ఇప్పించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీ విజయకుమార్, ఎంపీపీ బత్తిరాములు, మరియమ్మ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నూజెండ్ల, జూలై 12: మండలంలోని పాత ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో టీ వీరభద్రాచారి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశమై మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీ రమణమ్మ, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేదా స్కూల్‌లో కిశోర బాలికలకు అవగాహన సదస్సు

చిలకలూరిపేట, జూలై 12: పట్టణంలోని వేదా స్కూల్‌లో శుక్రవారం కిశోర బాలికల అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రముఖ గైనకాలజిస్టు ఐన ప్రభుత్వ డాక్టర్ లక్ష్మీకుమారి కిశోర బాలికల ఆరోగ్య సమస్యలు, రుతుక్రమంలో వచ్చే సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ శ్రీగిరి పెర్సీ స్వరూప మాట్లాడుతూ కిశోర బాలికలు రుతుక్రమ సమస్యలతోపాటు ఎటువంటి ఆరోగ్య సమస్యలనైనా దాచుకోకుండా తల్లితో చెప్పి సమస్యను పరిష్కరిచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యదీప్తి, ప్రిన్సిపల్ చైతఉషా, హెడ్ జోసెఫ్, కో-ఆర్డినేటర్ తీన తదితరులు పాల్గొన్నారు.

వేలూరు స్కూల్ విద్యార్థినికి ట్రిపుల్ ఐటీలో సీటు

చిలకలూరిపేట, జూలై 12: చిలకలూరిపేట మండలం వేలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని తస్నీరు జనని ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా ఆ విద్యార్థినిని హెచ్‌ఎం ఎం కిషోర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బొంతా చైతన్య, గ్రామస్థులు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ శాఖ ప్రారంభం

చిలకలూరిపేట, జూలై 12: పట్టణంలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్‌కు సమీపంలో శుక్రవారం కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ 30వ శాఖను శుక్రవారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా వ్యాపారులకు, ప్రజలకు సహకార బ్యాంకుల అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, వైస్‌చైర్మన్ గోలి రామకృష్ణ, బ్యాంక్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఏ శ్యామ్‌కిషోర్, మేనేజర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీ అప్పాపురం ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా దాసరి రవీంద్ర

నూజెండ్ల, జూలై 12: మండలంలోని వీ అప్పాపురం ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా దాసరి రవీంద్ర శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పంచాయతీ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కొత్త రోజారాణి వ్యక్తిగత కారణాలతో సెలవు పెట్టడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపసర్పంచ్‌గా ఉన్న రవీంద్రను ఇన్‌చార్జ్ సర్పంచ్ బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు ఎన్.వీరారెడ్డి, నక్కా బుల్లీశ్వరరెడ్డి, మారెళ్ళ నారాయణరెడ్డి, నాగ సుబ్బారెడ్డి, పంచాయతీ సెక్రటరీ జానీ బాషా, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.